ANN తెలుగు
Follow: @ANNTELUGU
14-06-2026
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 163 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

తెలంగాణ రాజకీయ రంగస్థలంపై ముసురుతున్న వ్యూహాల మేఘాలు.. గ్రేటర్ పీఠాన్ని దక్కించుకునేందుకు సాగుతున్న తెరవెనుక సమర సంకేతాలు! ఒకవైపు ఢిల్లీ వేదికగా సాగుతున్న లీగల్ చదరంగం, మరోవైపు నిధుల కొరతతో నత్తనడకన సాగుతున్న హైదరాబాద్ నగర ప్రగతి చక్రాలు. హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ ఎందుకు ముందుకు కదలడం లేదు? మెట్రోకు ఉన్న అడ్డంకులేంటి? ట్రిపుల్ ఆర్, మెట్రో 2 ఈ టర్మ్ లో పూర్తవుతాయా? వీటిని అపుతున్నదెవరు? అడ్డంకులేంటి? హైదరాబాద్ బాధ్యత బిజెపి ఎంపీలకు లేదా? మీనాక్షి నటరాజన్ పై కుట్రచేసిందెవరు? బిజెపి మైండ్ గేమ్ ఆడుతోందా? వరుస మీటింగ్ లతో గ్రేటర్ వార్ కు సీఎం తెరతీశారా? అధికార పీఠంపై ఉన్నవారు అభివృద్ధి మంత్రంతో గ్రేటర్ యుద్ధానికి శంఖారావం పూరిస్తుంటే, ప్రతిపక్షాలు సవాల్ విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో, అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది?

తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్
- మహా పత్రిక సీఈవో, జర్నలిస్ట్
**కంది రామచంద్రారెడ్డి**
వీకెండ్ అనాలసిస్



04

టాప్ న్యూస్

## షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీస్
- నా వ్యక్తిత్వం ఏంటో నిజామాబాద్ ప్రజలకు తెలుసు.
- లీకువీరుల సంగతి సీఎం తేలుస్తారు
- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్




03

## పంజాబ్ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు
ఈ ఏడాదే.. జరుగుతాయంటున్న అరవింద్ కేజ్రీవాల్



02

## 24 గంటల్లోనే అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం
పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కీలక ప్రకటన



02



# ట్యాపింగ్‌లో.. తుమ్మల
సంచలనంగా మంత్రి వాంగ్మూలం

## తుది ఛార్జిషీట్‌కు రంగం సిద్ధం
**మంత్రి తుమ్మల నివాసానికి వెళ్లి వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్**
**తుమ్మల ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా వివరాలు సేకరణ**

**హైదరాబాద్, మహా :** సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి

మిగతా 2వ పేజీలో

## దేశవ్యాప్త పర్యటనలకు రాహుల్ గాంధీ రెడీ
ఈనెల 17 నుండి టూర్లు

02

## జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ
కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక సమీక్ష.

02



# భారీ వర్షాల హెచ్చరిక
భారీ వర్షాలపై హై అలర్ట్ ప్రకటించిన సీఎం

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు
- జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల సమన్వయం
- నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- లోతట్టు ప్రాంతాల్లో విపత్తు బృందాల మోహరింపు

02




# ట్యాపింగ్‌లో.. తుమ్మల



**( మొదటి పేజీ తరువాయి )**

వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. త్వరలో తుది ఛార్జిషీట్ కూడా వేయనున్నారు.

# షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీస్



**హైదరాబాద్, మహా :** ఇన్నాళ్లుగా రాజకీయాల్లో ఉన్న షబ్బీర్ అలీ.. మహిళలను చులకన చేస్తూ మాట్లాడటం విచారకరమని, ఆయన స్థాయికి ఆ మాటలు తగవని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో శనివారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టి లో ఆయన పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఏడాది క్రితం మాట్లాడిన ఆడియోను ఇప్పుడు బయటపెట్టడం వెనుక ఉన్న లీకు వీరులు, గ్రీకు వీరుల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సమగ్ర విచారణ జరుపుతున్నారని స్పష్టం చేశారు. షబ్బీర్ అలీ ఆరోపణలపై తాను తొందరపడి స్పందించాల్సిన అవసరం లేదని, తన ఆస్తులు, తన వ్యక్తిత్వం, తన నిఖార్సైన ప్రస్థానం ఏంటో నిజామాబాద్ ప్రజలకు అణువణువూ తెలుసునని ఆయన ఉద్ఘాటించారు. చంద్రశేఖర్ రెడ్డిని స్వయంగా ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీలో చేర్పించింది షబ్బీర్ అలీనే అని గుర్తుచేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు ఇప్పటికే షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. రాజకీయాల్లో విభేదాలు సహజమే అయినా, వాటిని సాకుగా చూపి కుట్రలకు పాల్పడటం, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి బురదజల్లడం సరికాదన్నారు.

**మీనాక్షిపై పీఎంవో కుట్ర**

ఓట్లు చోరీ చేసిన కమలనాథులు ఇప్పుడు ఏకంగా సీట్లను సైతం కొల్లగొడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మహేష్‌కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధేయవాది మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో సాక్షాత్తూ ప్రధాన మంత్రి కార్యాలయం నేరుగా జోక్యం చేసుకుందని, ప్రధాని చేతిలో కీలుబొమ్మగా మారి నామినేషన్ తిరస్కరించిన రిటర్నింగ్ అధికారిని ఉరితీసినా తప్పులేదంటూ ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలన్న ఏకైక దుర్బుద్ధితో కాషాయ పార్టీ ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతోందని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. దేశంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? లేక నియంత పాలన నడుస్తోందా? అన్న తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మీనాక్షి నటరాజన్ పై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని, కనీస కేసు కూడా లేనప్పటికీ కేవలం ఓ పసలేని నోటీసును సాకుగా చూపి నామినేషన్ తిరస్కరించడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. ప్రధానమంత్రి కార్యాలయం నేరుగా జోక్యం చేసుకుని ఈ కేసును పక్కదారి పట్టించిందని, రాజకీయ ఒత్తిళ్లతో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) తన ఆఫీసులో కూర్చుని ప్రధాని చేతిలో కీలుబొమ్మగా, ఓ నియంతలా వ్యవహరించారని దుయ్యబట్టారు. నామినేషన్ తిరస్కరించే అధికారం లేకపోయినా పక్షపాతంగా వ్యవహరించిన సదరు ఆర్వోను ఉరితీసినా తప్పులేదంటూ ఆయన తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టులో సైతం న్యాయం దక్కకపోవడం, 24 గంటలు గడుస్తున్నా కేంద్ర ఎన్నికల సంఘం కనీసం స్పందించకపోవడం దేశ దౌర్భాగ్యమన్నారు. నిఖార్సైన నిజాయితీకి నిలువుటద్దం లాంటి తన సోదరి మీనాక్షి నటరాజన్‌ను బీజేపీ బలిపశువును చేసిందని టీపీసీసీ చీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు బీజేపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తూ సానుభూతి తెలుపుతుండటం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. బెంగాల్, మహారాష్ట్రల్లో బీజేపీ ఏ విధమైన రాజకీయ వికృత క్రీడకు తెరతీసిందో యావత్ దేశ ప్రజలు గమనించారని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇదే తరహా ఫాసిస్టు విధానాలను అవలంబించి ఉంటే, నేడు నరేంద్ర మోదీ కనీసం ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి అయ్యేవారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. పన్నెండేళ్లలో ప్రధాని మోదీ దేశానికి చేసిందేమీ లేదని, ఓట్లు చోరీ చేసిన బీజేపీ ఇప్పుడు ఏకంగా సీట్లను కూడా చోరీ చేస్తూ రాజ్యాంగాన్ని అత్యంత దుర్మార్గంగా అవమానిస్తోందని విమర్శించారు. ఒక దేశ ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు.

**నా గురించి హరీష్ కు బాగా తెలుసు**

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మీనాక్షి నటరాజన్‌కు జరిగిన అన్యాయంపై స్పందించాల్సిన కేటీఆర్, దాన్ని వదిలేసి సంబంధం లేని రాజకీయాలు మాట్లాడుతున్నారని మహేష్ గౌడ్ ఎద్దేవా చేశారు. మహేష్ కుమార్ గౌడ్ క్యారెక్టర్ ఏంటో కేటీఆర్ కంటే, మాజీ మంత్రి హరీష్ రావుకే చాలా స్పష్టంగా, సంపూర్ణంగా తెలుసునని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తుల కుట్రలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు తిప్పికొడుతుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# రూ.కోటి విలువైన గంజాయి పట్టివేత

**ఐదుగురిని అరెస్ట్ చేసిన 'ఈగిల్ ఫోర్స్.**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న 'ఈగిల్ ఫోర్స్' అధికారులు భారీ ఆపరేషన్ చేపట్టారు. పకడ్బందీగా సాగుతున్న అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ నెట్‌వర్క్ గుట్టురట్టు చేసి, సుమారు కోటి రూపాయల విలువైన 200 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భారీ స్మగ్లింగ్ దందాలో ప్రమేయం ఉన్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయగా, ముఠా ప్రధాన సూత్రధారులు పరారీలో ఉన్నారు.

ఈ ముఠాలో మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాకు చెందిన అమోల్ నానోబా గోరే, లక్ష్మణ్ నాగ్ నాథ్ కారేలతో పాటు తెలంగాణలోని కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన వసంత జాదవ్, షేక్ అన్సార్, షేక్ రహమత్‌లను ఈగిల్ ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 104 ప్యాకెట్లలో ఉన్న 200 కిలోల గంజాయితో పాటు ఏడు మొబైల్ ఫోన్లు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఒడిశా నుంచి ఈ గంజాయిని సరఫరా చేస్తున్న దేవీ సింగ్, మహారాష్ట్రలోని ఉద్గీర్‌కు చెందిన రిసీవర్ కమ్ ఫైనాన్షియర్ ప్రభు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గంజాయి రవాణా కోసం నిందితులు ప్రత్యేకంగా అద్దెకు తీసుకున్న స్విఫ్ట్ డిజైర్, బొలెరో వాహనాలను సీజ్ చేశారు.

ఈ అంతర్రాష్ట్ర ముఠా కదలికలపై ఈగిల్ ఫోర్స్ గత 18 నెలలుగా పక్కా నిఘా ఉంచింది. ప్రధాన నిందితుడు అమోల్ నానోబా గోరే గతంలో నల్గొండ జిల్లా విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 336 కిలోల గంజాయి కేసులో అరెస్టయ్యాడు. అదే కేసులో తప్పించుకు తిరుగుతున్న వసంత జాదవ్‌ను గతేడాది జూలైలో అధికారులు అరెస్ట్ చేయగా, ఆమె బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ ఇదే దందాకు తెరతీసింది. మరోవైపు, నిజామాబాద్ యువతను మత్తుకు బానిసలుగా మారుస్తూ డ్రగ్స్ మాఫియాను నడుపుతున్న షేక్ అన్సార్‌పై '1908' టోల్ ఫ్రీ నంబర్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ సమాచారంతో అప్రమత్తమైన ఈగిల్ ఫోర్స్ అధికారులు.. ఈ నెల 7వ తేదీ నుంచి నిందితుల కదలికలను రహస్యంగా ట్రాక్ చేసి, గంజాయిని తరలిస్తున్న సమయంలో వలపన్ని అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



# విజయ్ సర్కారు బీజేపీకి జిరాక్స్ కాపీ.


- **అధికార పార్టీ కార్యకర్తల నుంచే మహిళలకు ముప్పు.**
- **సిరా గుర్తు చెరగకముందే ప్రతిపక్ష ఎమ్మెల్యేల కోసం 'షాపింగ్'.**
- **రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం.**
- **ఎమ్మెల్యేల కొనుగోళ్లపై నిప్పులు చెరిగిన ఎం.కే. స్టాలిన్.**



**చెన్నై , మహా :** తమిళనాడులో విజయ్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఇతర రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ అమలు చేస్తున్న అప్రజాస్వామిక వ్యూహాలను తలపిస్తున్నాయని ఎం.కే. స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి విజయ్ ఏకంగా ప్రతిపక్ష అన్నాడీఎంకే ఎమ్మెల్యేల కోసం రాజకీయ బజారుబీలో 'షాపింగ్' చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. శనివారం చెన్నైలోని పార్టీ కేంద్ర కార్యాలయం అన్నా అరివాలయంలో జరిగిన డీఎంకే మహిళా విభాగం సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ వైఖరిని ఎండగట్టారు. రాష్ట్రంలో పాలిస్తున్న టీవీకే సర్కారు పూర్తిగా కేంద్రంలోని బీజేపీకి 'జిరాక్స్ కాపీ'లా వ్యవహరిస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి కొనుగోలు చేయడం, మహిళలపై వేధింపులకు పాల్పడే సొంత పార్టీ నేతలను వెనకేసుకురావడం వంటి చర్యల ద్వారా విజయ్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతోందని ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ఫలితాలు వచ్చి కేవలం ఇరవై ఒక్క రోజులు కూడా గడవక ముందే, కనీసం ఓటర్ల వేలికి ఉన్న సిరా గుర్తు కూడా చెరిగిపోకముందే నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు అధికార పార్టీ గూటికి చేరడం దారుణమన్నారు. వారికి ఏ స్థాయి పదవులు, ఎలాంటి భారీ ఆఫర్లు ఇచ్చి పార్టీలో చేర్చుకున్నారో ముఖ్యమంత్రి విజయ్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి అనైతిక రాజకీయ ఫిరాయింపులు ప్రజాస్వామ్య మూలాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రత గాలిలో దీపంగా మారిందని, ముఖ్యంగా అధికార పార్టీ కార్యకర్తల నుంచే మహిళలకు ముప్పు పొంచి ఉందని స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా శ్రీవైకుంఠంలో చోటుచేసుకున్న ఒక లైంగిక వేధింపుల ఘటనను ఆయన ఉదహరించారు. ఈ దారుణ ఘటనలో బాధిత మహిళ టీవీకే పార్టీకి చెందిన సభ్యురాలేనని, అలాగే ఆమెపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులు కూడా అదే అధికార పార్టీకి చెందిన వారేనని ఆయన గుర్తుచేశారు. అయితే ఈ కేసులో ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వం అత్యంత పక్షపాతంతో వ్యవహరించిందని దుయ్యబట్టారు. తప్పు చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఏకంగా బాధితురాలినే పార్టీ నుంచి అర్ధాంతరంగా తొలగించడం అధికార పార్టీ అహంకారానికి, మహిళల పట్ల వారికి ఉన్న చులకన భావానికి నిదర్శనమని స్టాలిన్ మండిపడ్డారు. రక్షకభటుల్లా ఉండాల్సిన అధికార పార్టీ కార్యకర్తల నుంచే మహిళలను రక్షించుకోవాల్సిన దుస్థితి నేడు రాష్ట్రంలో దాపురించిందని విమర్శించారు.గతంలో టీవీకే ప్రభుత్వంపై తాను చేసిన కొన్ని వ్యాఖ్యలను రాజకీయ ప్రత్యర్థులు కావాలనే వక్రీకరించారని ఎం.కే. స్టాలిన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి పరిపాలన కోసం కొంత సమయం ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని, కానీ ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఎమ్మెల్యేల కొనుగోళ్లు, మహిళలపై దాడులు తనను మౌనంగా ఉండనివ్వడం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని అనైతికంగా కూల్చాలన్న ఉద్దేశం తమ పార్టీకి ఏ కోశానా లేదని, ఒక బాధ్యతాయుతమైన బలమైన ప్రతిపక్షంగా డీఎంకే ప్రజా సమస్యల పట్ల నిరంతరం గళం విప్పుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపడం ప్రతిపక్షంగా తమ కనీస బాధ్యత అని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో డీఎంకే పార్టీని తిరిగి అధికార పీఠంపై కూర్చోబెట్టడానికి మహిళా కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలని, అంకితభావంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.

# జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక సమీక్ష.**



**ఢిల్లీ, మహా :** దేశంలో చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై (డెమోగ్రాఫిక్ చేంజెస్) అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ విధివిధానాలు, తదుపరి చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం ఉన్నతాధికారులతో కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దేశ సరిహద్దులతో పాటు వ్యూహాత్మక ప్రాంతాల్లో జనాభా గమనంలో వస్తున్న మార్పులను శాస్త్రీయంగా పరిశీలించేందుకు ఈ కమిటీకి అవసరమైన అన్ని రకాల వసతులు, పరిపాలనాపరమైన, సాంకేతిక సహకారాన్ని అందించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది (2025) ఆగస్టు 15న ఎర్రకోట వేదికగా చేసిన చారిత్రాత్మక ప్రకటనకు అనుగుణంగా, ఈ ఏడాది మే 26వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఈ ఉన్నత స్థాయి కమిటీని అధికారికంగా పునరుద్ధరించి, ఏర్పాటు చేసింది.

సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నావ్లేకర్ నేతృత్వంలోని ఈ ఉన్నత స్థాయి కమిటీ, దేశవ్యాప్తంగా ముఖ్యంగా అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటున్న సున్నితమైన ప్రాంతాల్లో జనాభా పరంగా సంభవిస్తున్న మార్పులపై సమగ్రమైన అధ్యయనం చేయనుంది. కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాకుండా, దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు, పారిశ్రామిక పట్టణాల్లోనూ అంతర్గత వలసలు, జనాభా సమతుల్యతలో వస్తున్న మార్పులను ఈ కమిటీ ప్రత్యక్షంగా సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలనలు జరపనుంది. ఇప్పటికే ఈ ఉన్నత స్థాయి కమిటీ తొలి సమావేశం విజయవంతంగా ముగిసిందని, కమిటీ యొక్క విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను (ఎజెండా) కూడా పక్కాగా రూపొందించుకున్నట్లు హోంశాఖ అధికారులు వెల్లడించారు. ఈ కమిటీ నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా విజయవంతంగా పూర్తి చేసేందుకు వీలుగా కేంద్ర హోంశాఖ లాజిస్టికల్ మద్దతుతో పాటు అవసరమైన సర్వసహకారాలను నిరంతరాయంగా అందిస్తుందని అమిత్ షా స్పష్టం చేశారు. దేశ భద్రత, సార్వభౌమత్వం, అంతర్గత సుస్థిరతపై జనాభా మార్పుల ప్రభావం ఏ మేరకు ఉందనే అంశాలపై ఈ కమిటీ ఇచ్చే నివేదిక భవిష్యత్ వ్యూహాలకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకోనుంది. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన నివేదికలు, గణాంకాలను కమిటీకి సకాలంలో అందేలా సమన్వయం చేసుకోవాలని అధికారులను హోంమంత్రి ఆదేశించారు.



# దేశవ్యాప్త పర్యటనలకు రాహుల్ గాంధీ రెడీ

**ఈనెల 17 నుండి టూర్లు**

**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా భారీ ఉద్యమానికి జాతీయ కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ నెల 17 నుంచి ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్త పర్యటనలు చేయనున్నారు. ఈ నెల 17న కోటా, జులై 10న అలహాబాద్, 11న పాట్నా, 14న ఢిల్లీలో సదస్సులు నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే హయాంలో జరిగిన పేపర్ లీక్‌లు, పరీక్షల అవకతవకలు, నిరుద్యోగ అంశాలపై పోరాటం చేయనున్నారు. విద్యార్థులతో ముఖాముఖి సదస్సులు నిర్వహించి ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్ష పేపర్ లీక్ దృష్ట్యా ప్రధానంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం వ్యక్తమవుతోంది.

# భారీ వర్షాల హెచ్చరిక



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో, ముఖ్యంగా రాజధాని నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల ప్రకారం రాబోయే గంటల్లో మరిన్ని తీవ్రమైన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అధికారులు అత్యంత అప్రమత్తంగా (హై అలర్ట్) ఉండాలని ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు చేసిన 'హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్' పరిధిలో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే ముప్పు ఉన్నందున, క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , డీజీపీ, 'క్యూర్' స్పెషల్ సీఎస్‌తో పాటు నగరంలోని అన్ని కీలక శాఖల ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, లా అండ్ ఆర్డర్ పోలీస్, హైడ్రా ,విద్యుత్ శాఖ, జలమండలి (వాటర్ బోర్డ్) అధికారులు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ నియంత్రణ చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. వాతావరణ శాఖ అందించే రెయిన్ ఫోర్‌కాస్టింగ్ (వర్ష సూచన) వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నగరంలో రోడ్లపై నీరు నిలిచే సమస్యాత్మక ప్రాంతాలను (వాటర్ లాగింగ్ పాయింట్స్) ముందుగానే గుర్తించాలని స్పష్టం చేశారు.వరద నీరు నిలిచే లోతట్టు ప్రాంతాలు, ఇరుకైన రహదారుల వద్ద విపత్తు నిర్వహణ బృందాలను ముందస్తుగా మోహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రధానంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలని, విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించేలా సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని చెప్పారు. నగరవాసులు కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వర్షం పడే సమయంలో ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని సీఎం కోరారు. తాజా వాతావరణ పరిస్థితులపై సచివాలయం నుంచి సీనియర్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

**పాస్‌పోర్టులు, వీసాలు ఏం లేవు**
**నకిలీ పాన్ కార్డు, ఆధార్ లతో**
**హైదరాబాద్ లో తిష్ట**



**హైదరాబాద్, మహా :** భాగ్యనగరంలో మరోసారి అక్రమ వలసదారుల గుట్టు రట్టయింది. హైదరాబాద్ నగర శివార్లలోని ప్రముఖ పారిశ్రామిక ప్రాంతమైన జీడిమెట్లలో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశీయులను సైబరాబాద్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎటువంటి పాస్‌పోర్టులు, వీసాలు లేకుండా దేశంలోకి చొరబడిన వీరు గత కొంతకాలంగా ఇక్కడే ఉంటూ స్థానిక కంపెనీల్లో కార్మికులుగా చలామణి అవుతున్నారు. నమ్మకమైన సమాచారం అందుకున్న పోలీసులు జీడిమెట్ల పరిధిలోని ఒక నివాస ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఈ ముఠాను పట్టుకున్నారు.పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుల నుంచి విస్మయకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వీరంతా పశ్చిమ బెంగాల్ సరిహద్దుల గుండా దళారుల సహాయంతో అక్రమంగా భారతదేశంలోకి ప్రవేశించినట్లు తేలింది. ఆ తర్వాత స్థానిక ఏజెంట్ల సాయంతో పశ్చిమ బెంగాల్ చిరునామాలతో నకిలీ ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, చివరకు ఓటర్ ఐడీ కార్డులను కూడా సృష్టించారు. ఈ నకిలీ గుర్తింపు కార్డులను చూపించి హైదరాబాద్‌లో ఇళ్లను అద్దెకు తీసుకోవడమే కాకుండా, స్థానిక పరిశ్రమల్లో ఎలాంటి అనుమానం రాకుండా ఉద్యోగాలు సంపాదించారు. ఇలాంటి అక్రమ వలసదారుల వెనుక పెద్ద హ్యూమన్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ పనిచేస్తోందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. కేవలం ఉపాధి కోసమే వీరు ఇక్కడికి వచ్చారా? లేక దీని వెనుక ఏవైనా దేశ విద్రోహ శక్తుల హస్తం ఉందా? అనే కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు. గతంలోనూ హైదరాబాద్ శివార్లలోని పహాడీషరీఫ్, చాంద్రాయణగుట్ట, బాలానగర్ ప్రాంతాల్లో బంగ్లాదేశీయులు పట్టుబడిన ఉదంతాలు ఉండటంతో ఈ ఏడుగురిని ఇక్కడికి తీసుకువచ్చిన ప్రధాన ఏజెంట్ల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

నిందితులు అక్రమ సంపాదనను హవాలా మార్గాల ద్వారా బంగ్లాదేశ్‌లో ఉన్న తమ కుటుంబాలకు చేరవేస్తున్నట్లు కూడా ఆధారాలు లభ్యమయ్యాయి. నిందితుల నుంచి నకిలీ భారతీయ పత్రాలతో పాటు పలు మొబైల్ ఫోన్లు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఫారినర్స్ యాక్ట్ తో పాటు భారతీయ న్యాయసంహితలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వీసాల గడువు ముగిసినా, లేదా అక్రమంగా దేశంలోకి వచ్చినా కఠిన చర్యలు తప్పవని సైబరాబాద్ పోలీస్ అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.



# ప్రధాని మోదీ సేవా స్ఫూర్తితో 'మన బడి మన బాధ్యత'

**ప్రభుత్వ పాఠశాలల్లో ముమ్మరంగా స్వచ్ఛతా కార్యక్రమాలు**

**కరీంనగర్, మహా :** ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని అందించాలనే సదుద్దేశంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 'మన బడి - మన బాధ్యత' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. 'కరీంనగర్ సేవలో' అనే బృహత్తర కార్యక్రమంలో భాగంగా సిరిసిల్లలోని ప్రసిద్ధ కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో భారీ ఎత్తున శ్రమదానం, పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. సెలవుల అనంతరం విద్యార్థులు తిరిగి బడులకు వస్తున్న నేపథ్యంలో.. వారు అడుగుపెట్టే సమయానికి పాఠశాల ఆవరణ అంతా పరిశుభ్రంగా, సురక్షితంగా, వారిని ఆహ్వానించేలా ఉండాలన్న ఉన్నత లక్ష్యంతో సామాజిక కార్యకర్తలు, స్థానికులు ఈ మహాకార్యంలో భాగస్వాములయ్యారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిస్వార్థంగా సాగిస్తున్న 12 ఏళ్ల సుదీర్ఘ ప్రజా సేవ (12 ఇయర్స్ ఆఫ్ సేవ) స్ఫూర్తితో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# పంజాబ్ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు

**ఈ ఏడాదే..**
**జరుగుతాయంటున్న కేజ్రీ**

**చండీగఢ్:** పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు. బటిండాలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు తక్షణం ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందస్తు ఎన్నికలకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. గత నాలుగేళ్లుగా పంజాబ్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని, మద్దతును సాధించిందని అన్నారు. పంజాబ్‌లో పలు సంక్షేమ పథకాలను ఆప్ అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా ప్రజలకు అందిస్తోందని కేజ్రీవాల్ గుర్తు చేశారు. జూలై నుంచి అర్హత కలిగిన మహిళలకు ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.1,500 చొప్పున ఇస్తామని తెలిపారు.



# 24 గంటల్లోనే అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం

**పాకిస్థాన్ ప్రధాని కీలక ప్రకటన**

మహా : దాదాపు 3 నెలలకుపైగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా ఎట్టకేలకు దీనికి ఎండ్ కార్డ్ పడేలా కనిపిస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం మరో 24 గంటల్లో ఖరారయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ తాజాగా ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఇరాన్ మధ్య చర్చలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందం ఖరారైన వెంటనే డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు జరిగేలా పాకిస్థాన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు షరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో శనివారం ఓ పోస్ట్ చేశారు.



# గుర్రపు డెక్కన్ వెంటనే తొలగించాలి

## సిపిఎం డిమాండ్

**వలిగొండ జూన్ 13 మహా న్యూస్**
భీమ లింగం కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కన్ వెంటనే తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగిస్వామి అన్నారు శనివారం సిపిఎం మండల పట్టణ కమిటీల ఆధ్వర్యంలో బునాధికాల్వ ప్రవహించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు గుర్రెప్పుడెక్క మొక్కలతో నిండిపోయి నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయంకలిగిస్తున్న దుస్థితిని వారు పరిశీలించారు వలిగొండ నుండి తుర్కపల్లి మీదుగా పాలడుగు వరకు ప్రవహించే భీమ లింగం కాల్వలో విపరీతంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకు చెత్త చెదారలను వెంటనే అధికారులు స్పందించి తొలగించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కూర శ్రీనివాస్ మెరుగు వెంకటేశం దుబ్బ లింగం గర్దాసు నరసింహ కొండూరు సత్తయ్య రాధారపు మల్లేశం శీలం ఇందిరా లక్ష్మయ్య యాదగిరి నరసింహ శంకర్ తదితరులు పాల్గొన్నారు

# సింగరేణిలో రూ.1,600 కోట్ల బొగ్గు మాయం..!


- **అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి.**
- **సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ.**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మ అయిన సింగరేణి (ఎస్‌సీసీఎల్) సంస్థలో చోటుచేసుకున్నాయంటున్న అవకతవకలపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు అదృశ్యమైందంటూ వస్తున్న వార్తలపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆయన కోరారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను నిగ్గుతేల్చడంతో పాటు, సంస్థను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ముఖ్యమంత్రికి కిషన్‌రెడ్డి తాజాగా ఒక లేఖ రాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో నడుస్తున్న సింగరేణి సంస్థ తెలంగాణకే కాకుండా దేశ ఇంధన భద్రతలోనూ కీలక పాత్ర పోషిస్తోందని కిషన్‌రెడ్డి తన లేఖలో గుర్తుచేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న ఇలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ నిరంతర అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నదన్నారు. అయితే, ఇటీవల పత్రికల్లో సింగరేణిలో భారీగా అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు పక్కదారి పట్టిందని వచ్చిన కథనాలు కలవరపెడుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి చెల్లించాల్సిన రూ.51,500 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోవడంతో సంస్థ తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉందని, ఈ తాజా బొగ్గు మాయం వార్తలు సంస్థ మనుగడను, భవిష్యత్ అభివృద్ధిని మరింతగా దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. సింగరేణి ప్రయోజనాలను కాపాడేందుకు, ఆరోపణల్లోని వాస్తవాలను బయటపెట్టేందుకు తక్షణమే విచారణకు ఆదేశించాలని ముఖ్యమంత్రిని కేంద్రమంత్రి కోరారు. అలాగే, సంస్థలో పారదర్శకత, విశ్వసనీయత పెంచేందుకు తగిన సేఫ్‌గార్డ్స్, పటిష్టమైన ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్‌ను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మానిటరింగ్ టూల్స్ వినియోగించడం ద్వారా, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడం ద్వారా లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి పరిష్కరించవచ్చని ఆయన సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి కుంభకోణాలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అలాగే సంస్థ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు.



# భారీ వర్షా ల వేళ క్షేత్రస్థాయిలో డీజీపీ

- **ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.**
- **అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ కీలక ఆదేశాలు.**



**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నగరంలో కురుస్తున్న ఏకధాటి వర్షాల నేపథ్యంలో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. నగరంలోని మల్కంపేట చెరువు, టోలిచౌకి తదితర పరిసర ప్రాంతాల్లో ఆయన స్వయంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వర్షాల కారణంగా క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్‌తో డీజీపీ చర్చించారు. ఈ సందర్భంగా విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి పోలీసు యంత్రాంగానికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు**
రహదారులపై వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయి సిబ్బందిని డీజీపీ ఆదేశించారు. ప్రధాన కూడళ్లు, రోడ్లపై నీరు చేరిన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టాలని, వాహనాల రాకపోకలు సాఫీగా జరిగేలా ట్రాఫిక్ క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా మున్సిపల్, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగించాలని స్పష్టం చేశారు.

**జిల్లాల పోలీసులకు హైఅలర్ట్.. ప్రజలకు సూచనలు**
హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాల ప్రభావం ఉన్నందున అన్ని జిల్లాల పోలీసు అధికారులను డీజీపీ అప్రమత్తం చేశారు. ఉన్నతాధికారులు, సిబ్బంది అంతా హైఅలర్ట్‌గా ఉండాలని, ఎక్కడ ఎలాంటి విపత్తు ముప్పు పొంచి ఉన్నా వెంటనే స్పందించేలా బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో ప్రజలు సైతం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న వేళ జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా వరద నీరు నిల్వ ఉన్న ప్రాంతాలకు, ఉధృతంగా ప్రవహిస్తున్న నాలాలకు ప్రజలు దూరంగా ఉండాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# అస్సాంలో ఘోర విషాధం

**కూలిన వాయుసేన విమానం**
**ఐదుగురు ఐఏఎఫ్ సిబ్బంది మృతి**

**గౌహతి, మహా :** భారత వైమానిక దళంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో శనివారం జరిగిన ఒక ఘోర విమాన ప్రమాదంలో ఐదుగురు ఐఏఎఫ్ సిబ్బంది దుర్మరణం పాలయ్యారు. వాయుసేనకు చెందిన ఏఎన్32 రవాణా విమానం సాధారణ శిక్షణలో భాగంగా గాల్లోకి ఎగిరిన కాసేపటికే సాంకేతిక లోపంతో కూలిపోయినట్లు రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. జోర్హాట్ ప్రాంత సమీపంలో ఈ ప్రమాదం సంభవించినట్లు భారత వైమానిక దళం అధికారికంగా ధృవీకరించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఐఏఎఫ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సాధారణ శిక్షణ ఫ్లైట్ సమయంలోనే ఈ విమానం నియంత్రణ కోల్పోయి నేలకూలిందని వాయుసేన ప్రకటనలో తెలిపింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాద తీవ్రతకు విమాన శకలాలు అక్కడ ఉన్న పొలాల్లో చెల్లాచెదురుగా పడిపోయాయి. విమానం పూర్తిగా ధ్వంసమవడంతో లోపల ఉన్న ఐదుగురు సిబ్బందిని కాపాడే అవకాశం లేకుండా పోయింది. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వైమానిక దళ సిబ్బంది కుటుంబాలకు ఐఏఎఫ్ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. "ఈ కష్టసమయంలో మరణించిన వీరుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆ జవాన్ల కుటుంబాలకు వాయుసేన అండగా ఉంటుంది," అని వైమానిక దళం ఎక్స్ వేదికగా పేర్కొంది. ప్రమాదానికి గల కారణాలపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. వాయుసేన వెల్లడించిన వివరాల ప్రకారం.. చనిపోయిన వారిలో స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సర్జెంట్ జితేంద్ర శర్మ ఉన్నారు. వీరితో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం ద్వారా ఎంపికైన ఇద్దరు యువ జవాన్లు అగ్నివీర్‌వాయు ఖేమారామ్ కుమావత్, అగ్నివీర్‌వాయు డానిష్ ఆలమ్ కూడా ఈ ప్రమాదంలోనే కన్నుమూశారు.

# ఉద్యమకారులను గుర్తించడానికి జ్యుడీషియల్ కమిషన్ వేయాలి

**సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు**

**భువనగిరి జూన్13 మహా న్యూస్** తెలంగాణ పోరాట యోధులను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేయాలని మలిదశ ఉద్యమకారుడు టి యు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం కేకే కమిటీ వేయడం కాలయాపన కోసమేనని ఆయన అన్నారు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజా పాలనలో పెట్టిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఉద్యమకారులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమావేశంలో కొండాపురం శ్రీనివాస్ ములుగు లక్ష్మయ్య నరసింహ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ నెలాకరులోపు పి ఆర్ సిని ప్రకటించాలి

- పెండింగ్ డి ఏ లను విడుదల చేయాలి
- టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్యా కయ్య




**యాదాద్రి భువనగిరి జూన్ 13 మహా :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ( టి ఎస్ యు టి ఎఫ్ ) జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య అధ్యక్షతన శనివారం భువనగిరిలో జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాకయ్య మాట్లాడుతూఈ నెలాకరులోపు పి ఆర్ సి నివేదికను తెప్పించుకుని ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్ ప్రకటించాలని, పెండింగ్ డి ఎ లను విడుదల చేయాలని, పాఠశాలల కుదింపు చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని, ఉపాధ్యాయ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిన విధంగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తోందని, కేవలం ఒకటో తారీకున వేతనాలు అందజేయడాన్నే గొప్పగా చెప్పుకుంటోందని అన్నారు. ఒకటో తారీకునా వేతనం పొందడం తమ హక్కు అని అన్నారు. ఒకవైపు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచుకుంటూ పోవడం వల్ల నిత్యవసర ధరలు కొండెక్కుతున్నాయని తద్వారా వేతన జీవుల వెతలు రోజు రోజుకు పెరుగుతున్నాయని అన్నారు ప్రస్తుత ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీలైన సిపిఎస్ రద్దు, 317 జి ఓ బాధితులను సొంత జిల్లాలకు కేటాయించడం తక్షణమే చేపట్టాలని అన్నారు. పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయుటకు, ఎం ఈ ఓ, డిప్యూటీ ఈ ఓ పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని, గురుకుల, మోడల్ స్కూల్, కేజీబీవీ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు చాలా ఏళ్లుగా పేరుకుపోయాయని తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఊరు, ప్రతి తండా, గూడెం లలో స్కూల్ ఉండడం నా ధ్యేయం అని ముఖ్యమంత్రిగా ప్రకటించిన విషయాన్ని మరిచి స్కూల్స్ సంఖ్యను కుదిస్తామని ముఖ్యమంత్రి అనడం సమంజసం కాదని అన్నారు. ఇన్ సర్వీస్ టీచర్స్ కి సబ్జెక్టుల వారీగా ప్రత్యేక టి ఈ టి ని నిర్వహించి, అర్హత మార్కులను కుదించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన మెమో నెంబర్ 57 ప్రకారం 2004 సెప్టెంబర్ కు ముందు నియామకం అయిన 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై నెలలో బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని, గురుకుల పాఠశాలల, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, ఉపాధ్యక్షులు కె మమత, కోశాధికారి బి ముత్యాలు, జిల్లా కార్యదర్శులు పి వెంకట్ రెడ్డి, ఎస్ సుధర్మ రెడ్డి, కె రవికుమార్, జీవి రమణారావు, కె శ్రీనివాస్, జిల్లా అడిట్ కన్వీనర్ కరుణాకర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎస్ అనిల్ కుమార్, స్టడీ సర్కిల్ కన్వీనర్ పి మురళి జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరియు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# టువీలర్ ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**ఇద్దరికి తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు**




**మహా వరంగల్ బ్యూరో ;**వరంగల్ జిల్లా గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సంపేట ప్రధాన రహదారిలో అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చిన ఓ ఆర్టీసీ బస్సు, బైక్ ను బలంగా ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలలోకి వెళ్తే.. గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం సుధాకర్ వైన్స్ ఎదురుగా ఉన్న రోడ్ క్రాస్ డివైడర్ వద్ద చోటుచేసుకుంది ఎస్సార్ నగర్, ఏనుమాముల, వరంగల్ జిల్లా కు చెందిన లక్కర్స్ రవీందర్ (48), రంగశాయిపేటకు చెందిన మోదం నవీన్ అనే వ్యక్తితో కలిసి నిన్న (జూన్ 12) మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో దర్మారం గ్రామంలో పని ముగించుకుని తమ టీవీఎస్ ఎక్సెల్ నెంబర్ టీజీ 24 ఎ 3995) పై తిరిగి వస్తున్నారు. వరంగల్ వైపు రావడానికి ధర్మారం సుధాకర్ వైన్స్ ఎదురుగా ఉన్న రోడ్ క్రాస్ డివైడర్ వద్ద ఇండికేటర్ వేసి రోడ్డు దాటుతుండగా, నర్సంపేట నుండి హన్మకొండ వైపు వెళ్తున్న టీజీ ఆర్టీసీ నర్సంపేట డిపో బస్సు నెం. టీజీ 36 యు 6556 ను నడుపుతూన్న డ్రైవర్ పత్తి రమేష్ అతివేగంగా వచ్చి వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టగా ఈ ప్రమాదంలో లక్కర్స్ రవీందర్‌కు తలకు, చేతులకు, ఛాతికి తీవ్ర గాయాలయ్యాయి. మొదం నవీన్‌కు కూడా కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా వారిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. నవీన్ కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యుల సలహా మేరకు గార్డియన్ ఆసుపత్రికి తరలించారు. లక్కర్సు రవీందర్ కుమారుడు లక్కర్స్ అఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ గీసుగొండ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

# ప్రైవేట్ పాఠశాలల పుస్తకాల దందా..!

- **అకాడమిక్ సంవత్సరం ప్రారంభానికి ముందే తల్లిదండ్రులపై ఆర్థిక భారం...**
- **నిబంధనలను ఉల్లంగిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు...**
- **- చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల ఆవేదన...**



**వేములవాడ,మహా:** వేములవాడ పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పుస్తకాలు,నోట్ బుక్స్,యూనిఫాంల విక్రయాలకు శ్రీకారం చుట్టినట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ప్రవేశాల సమయంలోనే నిర్దిష్ట పుస్తకాల సెట్లు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మార్కెట్ లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలను పక్కనపెట్టి, పాఠశాలలు సూచించిన చోటే కొనుగోలు చేయాలని చెప్పడం వల్ల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పలువురు వాపోతున్నారు.

**- విద్యా హక్కు చట్టం ఉద్దేశాలకు విరుద్ధమా..?**
విద్యా హక్కు చట్టం (Right to Education Act - RTE) ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, అందుబాటు విద్య అందించడమే ప్రధాన లక్ష్యం. అయితే కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రి పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. విద్యా హక్కు చట్టం భావన ప్రకారం విద్యార్థులపై అనవసర ఆర్థిక భారం మోపకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, వాటి అమలులో లోపాలు కనిపిస్తున్నాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

**- ఒకే చోట కొనుగోలు చేయాలని ఒత్తిడి**
కొన్ని పాఠశాలలు తమకు అనుబంధంగా ఉన్న బుక్ స్టోర్లలోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని సూచిస్తున్నట్లు సమాచారం. దీంతో పోటీ మార్కెట్‌లో లభించే తక్కువ ధరల అవకాశాలను తల్లిదండ్రులు కోల్పోతున్నారు. పుస్తకాలతో పాటు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు, యూనిఫాంలను కూడా ఒకే ప్యాకేజీగా విక్రయించడం ద్వారా వేల రూపాయల అదనపు భారం పడుతోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనలు అమలు కావడం లేదా..?**
విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలు తల్లిదండ్రులను నిర్దిష్ట దుకాణాల నుంచి పుస్తకాలు లేదా ఇతర సామగ్రి కొనుగోలు చేయాలని బలవంతం చేయకూడదు. అలాగే ఫీజులు, పుస్తకాల ధరల విషయంలో పారదర్శకత పాటించాల్సి ఉంటుంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


**అధికారుల పర్యవేక్షణ అవసరం**
విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న పుస్తకాల విక్రయాలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పుస్తకాల ధరలు, విక్రయ విధానాలు, నిబంధనల అమలుపై తనిఖీలు నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చే ధోరణిపై కఠిన చర్యలు తీసుకుంటేనే తల్లిదండ్రులకు ఉపశమనం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
"పిల్లలకు విద్య అందించాలా..? లేక ప్రతి సంవత్సరం పెరుగుతున్న పుస్తకాలు, యూనిఫాంల ఖర్చులను భరించాలా..?" అనే ప్రశ్న ప్రస్తుతం వేములవాడ ప్రాంత తల్లిదండ్రుల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యా హక్కు చట్టం లక్ష్యాలు నిజంగా అమలవుతున్నాయా లేదా అన్న సందేహాలు ఉన్నాయి వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితిని సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

# బండలేమూరు చెన్నారెడ్డిగూడా చౌరస్తాలో ధర్నా

- **ఆరుట్ల నుంచి చెన్నారెడ్డిగూడ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి**
- **సర్పంచులు విజయ వెంకటేష్ శ్రీనివాస్ నాయక్**
- **దాదాపు రెండు గంటల పాటు నిలిచిపోయిన వాహనాలు**
- **అతుకులు గతుకులతో తరచూ ప్రమాదాలు**
- **తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు**



**ఇబ్రహీంపట్నం జూన్ 13 మహా:** ఆరుట్ల నుండి చెన్నారెడ్డిగూడ, బండలేము గ్రామాలకు వెళ్లే రహదారి అతుకులు గతుకులు ఉండడంతో తరచులు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ యొక్క రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని, ప్రజలు ధర్నా చేపట్టడం జరిగిందని, విజయ వెంకటేష్, శ్రీనివాస్ నాయక్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో ఆరుట్ల నుంచి చెన్నారెడ్డి గూడా బండలేమూర్ గ్రామాలకు వెళ్లే రహదారి గుంతల మయమై అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ రహదారిలో గతంలో రోడ్డు ప్రమాదం జరిగి వ్యక్తి దుర్మరణం చెందాడని గ్రామస్తులు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఇరు గ్రామాల సర్పంచులు పగడాల విజయ వెంకటేష్, పాత్రోత్ శ్రీనివాస్ నాయక్, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున చెన్నారెడ్డి కూడా చౌరస్తా వద్ద చేరుకొని ధర్నా చేపట్టడం జరిగింది. దీంతో వాహనాలు దాదాపు రెండు గంటల పాటు నిలపడంతో, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రెండు గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో నిధులు మంజూరై ఉన్న, రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదని అన్నారు స్థానిక ఎమ్మెల్యే గత ఎన్నికలలో రోడ్డు విస్తరణ పనులు చేపడతానని హామీ ఇచ్చి మరిచారని ఆరోపణలు చేశారు. అధికారులు ఎమ్మెల్యే కలెక్టర్ స్పందించి వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రమాదాలను తగ్గించాలని ఎమ్మెల్యేను కోరారు. లేనియెడల జిల్లా కలెక్టరేటును ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామని బండలేమూర్, చెన్నారెడ్డిగూడ సర్పంచులు విజయ వెంకటేష్,శ్రీనివాస్ నాయక్ హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు బహదూర్ మాట్లాడుతూ... బండలేమూర్ చెన్నారెడ్డి గూడ గ్రామాలకు వెళ్లే రహదారి అతుకులు గతుకులతో వాహనదారులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే ఇరు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే భారీ ఎత్తున కలెక్టరేట్ను ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. బిఎస్పీ



నాయకులు వంగల కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఈ రెండు గ్రామాలు అభివృద్ధి నోచుకోలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే జరుగుతుందని ఆయన వాపోయారు. గత ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆరుట్ల నుంచి చెన్నారెడ్డిగూడ, బండలేమురు గ్రామాలకు రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట విస్మరించి నేటికీ విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు ప్రయాణికులు వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వీకే ప్రసాద్ కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో రెండు గ్రామాల ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# గ్రేటర్ చదరంగం ఢిల్లీ లీగల్ స్క్రీన్ ప్లే!

తెలంగాణ రాజకీయ రంగస్థలంపై ముసురుతున్న వ్యూహాల మేఘాలు.. గ్రేటర్ పీఠాన్ని దక్కించుకునేందుకు సాగుతున్న తెరవెనుక సమర సంకేతాలు! ఒకవైపు ఢిల్లీ వేదికగా సాగుతున్న లీగల్ చదరంగం, మరోవైపు నిధుల కొరతతో నత్తనడకన సాగుతున్న హైదరాబాద్ నగర ప్రగతి చక్రాలు. హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ ఎందుకు ముందుకు కదలడం లేదు? మెట్రోకు ఉన్న అడ్డంకులేంటి? ట్రిపుల్ ఆర్, మెట్రో 2 ఈ టర్మ్ లో పూర్తవుతాయా? వీటిని అపుతున్నదెవరు? అడ్డంకులేంటి? హైదరాబాద్ బాధ్యత బిజెపి ఎంపీలకు లేదా? మీనాక్షి నటరాజన్ పై కుట్రచేసిందెవరు? బిజెపి మైండ్ గేమ్ ఆడుతోందా? వరుస మీటింగ్ లతో గ్రేటర్ వార్ కు సీఎం తెరతీశారా? అధికార పీఠంపై ఉన్నవారు అభివృద్ధి మంత్రంతో గ్రేటర్ యుద్ధానికి శంఖారావం పూరిస్తుంటే, ప్రతిపక్షాలు సవాల్ విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో, అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది?

**తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్**

**- మహా పత్రిక సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**





తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్న రాజకీయం.. 'అభివృద్ధి వర్సెస్ అథారిటీ'. మీనాక్షి నటరాజన్ ఎపిసోడ్‌తో కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి లీగల్ షాక్ ఇచ్చింది. లేని కేసును అడ్డంపెట్టి నామినేషన్ తిరస్కరించడంతో పాటు ఆ నెపం కూడా కాంగ్రెస్ పై నెట్టి మైండ్ గేమ్ ఆడింది. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి కనీసం ఒక రోజు స్క్రూటినీని వాయిదా వేసి ఉంటే, ఆమె ఉన్నత న్యాయస్థానం నుండి స్టే లేదా అనుకూల ఉత్తర్వులు తెచ్చుకునే అవకాశం ఉండేది. ఆ సమయం ఇవ్వకుండా రాత్రికి రాత్రే ఏకపక్షంగా నామినేషన్ తిరస్కరించడం ఇది ఢిల్లీ బిజెపి ముందస్తు వ్యూహంగానే కనిపిస్తున్నది. మరోవైపు, వివాదానికి కారణమైన నాంపల్లి కోర్టులోని ఆ ప్రైవేట్ కేసును కోర్టు పూర్తిగా కొట్టేసింది. కేసులోనే సత్తా లేనప్పుడు, కేవలం నోటీస్ దశను సాకుగా చూపి నామినేషన్ చెల్లకుండా చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. బీజేపీ ఈ టెక్నికల్ లూప్‌హోల్‌ను వాడుకుని చాలా 'స్మార్ట్'గా వ్యవహరించామని అనుకుంటోంది కానీ, ఇది రాజకీయంగా ఆ పార్టీ వేసిన ఒక పెద్ద రాంగ్ స్టెప్. రాజకీయ బలాలు పక్కనపెట్టి టెక్నికల్ అంశాలతో గెలవాలని చూడటం రాజకీయంగా సరైన విధానం కాదు. ఇంతా చేసి తెలంగాణ కాంగ్రెస్ నేతలే తమ లీకు ఇచ్చారని ఓ క్యాంపెయిన్ నడపడం విస్మయం కలిగించే అంశం. బిజెపిది కిమ్ విధానమని.. ఎన్నికలు జరుగుతాయి కానీ ఏ ఎన్నికైనా ఫలితం కిమ్ చెప్పినట్లే వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో అన్నారు. ఇంతకాలం చీలికలు, ఆకర్షణలు, విలీనాలతో నెట్టొచ్చిన బిజెపి.. ఇపుడు మధ్యప్రదేశ్ లో సాంకేతిక అంశం సాకుగా చూపి గెలిచిన తీరు సరైంది కాదన్న చర్చ దేశవ్యాప్తంగా ఉంది.

హైదరాబాద్ మెట్రో రెండో విడత విస్తరణ ఫైళ్లు ఢిల్లీ, హైదరాబాద్ మధ్య నలుగుతుండటం నగర ప్రజలకు పెద్ద శాపంగా మారింది. దీని వెనుక ప్రధానంగా రెండు అడ్డంకులు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం సుమారు 122.9 కిలోమీటర్ల మేర 8 కొత్త కారిడార్లతో కూడిన సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూ.38,595 కోట్ల అంచనాతో కేంద్రానికి సమర్పించింది. ఫిఫ్టీఫిఫ్టీ ఉమ్మడి భాగస్వామ్యం కింద నిర్మించాలన్నది రాష్ట్ర ప్రతిపాదన. అయితే, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వద్ద ఈ ఫైలు ఇంకా టెక్నికల్ స్క్రూటినీ మరియు క్యాబినెట్ ఆమోదం దశలోనే ఆగిపోయింది. గతంలో ఫేజ్ 1 నిర్వహించిన ఎల్ అండ్ టీ సంస్థ దాదాపు రూ.13వేల కోట్ల అప్పుల భారం, నష్టాల వల్ల ప్రాజెక్టు నుండి వైదొలగాలని నిర్ణయించుకుంది. హెచ్ ఎం ఆర్ ఎల్ ఈ బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకోవడంతో పాత లీగల్ అడ్డంకులు కొన్ని తొలిగాయి. కానీ, ప్రస్తుతం రాష్ట్ర ఖజానాపై ఉన్న అప్పుల భారం వల్ల కేంద్ర నిధుల వాటా, గ్రీన్ సిగ్నల్ రాకుండా ఒంటరిగా పనులు మొదలుపెట్టే ఆర్థిక పటిష్టత రాష్ట్రానికి లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాయదుర్గం నుంచి గచ్చిబౌలి మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రూట్ మ్యాప్ సిద్ధం చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే దాని అలైన్‌మెంట్‌ను మార్చింది. ఐటీ కారిడార్ దాటిన తర్వాత ఔటర్ రింగ్ రోడ్ వెంట జనసాంద్రత చాలా తక్కువ. కేవలం విమానాశ్రయానికి వెళ్లే సంపన్న వర్గాలకే అది ఉపయోగపడుతుంది తప్ప, పాతబస్తీ, మధ్యతరగతి ప్రజలకు లాభం లేదన్నది సీఎం రేవంత్ రెడ్డి వాదన. ఆ రూట్ కేవలం కొన్ని కార్పొరేట్ సంస్థల, రియల్ ఎస్టేట్ వెంచర్ల భూముల విలువ పెంచడానికే ఉపయోగపడుతుందని భావించి దాన్ని మార్చారు. కొత్తగా నాగోల్ ఫోర్త్ సిటీ ప్లాన్ చేశారు. కానీ ఏదీ మొదలు కాలేదు. ఫలితంగా రెండున్నరేళ్ళయినా రెండోదశకు మోక్షం లేదు.

మెట్రో ఉత్తర భాగం సంగారెడ్డి తూప్రాన్ గజ్వేల్ చౌటుప్పల్ సెగ్మెంట్‌కు సంబంధించి దాదాపు 94శాతం భూసేకరణ పూర్తయింది. కొన్ని ప్రాంతాల్లో సర్వీస్ రోడ్ల పనులు కూడా మొదలయ్యాయి. వేగంగా జరిగితే 2029 నాటికి ఉత్తర భాగం ఖచ్చితంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దక్షిణభాగంకు సంబంధించి చౌటుప్పల్ ఆమన్ గల్ శంకర్ పల్లి సంగారెడ్డి సెగ్మెంట్ ఇంకా అలైన్‌మెంట్ , ప్రాథమిక భూసేకరణ దశలోనే ఉంది. దీనికి కేంద్ర రవాణా శాఖ తుది అనుమతులు, రూ.15,627 కోట్ల సవరించిన అంచనాలకు ఆమోదం ఇంకా రాలేదు. కాబట్టి ఈ టర్మ్‌లో దక్షిణ భాగం పూర్తి కావడం అసాధ్యం. ఇక మెట్రో ఫేజ్ 2 విషయానికొస్తే ఇంకా కేంద్రం అనుమతులే ఇవ్వలేదు. కేంద్రం ఈ ఏడాది చివర్లో అనుమతులు ఇచ్చినా.. టెండర్లు ముగిసి, పిల్లర్లు లేచి, రైలు పట్టాలెక్కడానికి కనీసం ఐదారేళ్ళు పడుతుంది. అంటే 2031 లేదా 2032 నాటికి కానీ ఫేజ్ 2 పూర్తి రూపం దాల్చదు. ఈ టర్మ్‌లో కేవలం ఓల్డ్ సిటీ (ఎంజిబిఎస్‌చంద్రాయణగుట్ట) లేదా రాయదుర్గంకోకాపేట నియోపొలిస్ లు పట్టుబడితే పూర్తికావొచ్చు. తమిళనాడు ప్రభుత్వం చెన్నై మెట్రో ఫేజ్ 2 కోసం కేంద్ర నిధులు ఆలస్యమయ్యాక సొంతంగా లోన్లు తెచ్చుకుని పనులు స్పీడప్ చేసింది. కానీ, తెలంగాణ ప్రభుత్వం ఆ తరహా రిస్క్ తీసుకోకుండా కేంద్రంపైనే భారం వేయడం, మరోవైపు కేంద్రం నిధుల విడుదలలో తాత్సార్యం చేయడం వల్ల ప్రాజెక్టులు అటకెక్కాయి. గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల పరిధిలో లోక్‌సభ ఎన్నికల్లో నగర ప్రజలు బీజేపీకి పెద్దపీట వేశారు. సికింద్రాబాద్ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర ప్రగతిపై బీజేపీ ఎంపీల బాధ్యతపై చర్చ సహజంగా జరుగుతోంది. తెలంగాణకు రావాల్సిన మెట్రో ఫేజ్ 2 నిధులు, ట్రిపుల్ ఆర్ నిధులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొక్కిపెడుతోందని, గుజరాత్‌లోని సూరత్, రాజ్‌కోట్ మెట్రోలకు ఇస్తున్న ప్రాధాన్యత హైదరాబాద్‌కు ఇవ్వడం లేదని కాంగ్రెస్ సౌత్ సెంటిమెంట్, కేంద్ర వివక్ష అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల డిజైన్లను పదే పదే మార్చడం, సకాలంలో డీపీఆర్‌లు ఇవ్వకపోవడం వల్లే లేట్ అవుతోందని బీజేపీ వాదిస్తోంది. రాజకీయాలు పక్కన పెడితే.. హైదరాబాద్ గ్లోబల్ ఇమేజ్ కాపాడాల్సిన బాధ్యత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరియు స్థానిక బీజేపీ ఎంపీలపై ఖచ్చితంగా ఉంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతులు వేగంగా తీసుకురాకపోతే, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైదరాబాద్ నగర ఓటర్ల ముందు బీజేపీ డిఫెన్స్‌లో పడక తప్పదు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత కొన్ని వారాలుగా హైదరాబాద్ ను చుట్టేస్తున్నారు. ఇబ్రహీంపట్నం కోహెడ, ఉప్పల్, గాజులరామారం, ఫ్యూచర్ సిటీ ఇలా వరుస సభలతో గ్రేటర్ హైదరాబాద్ లో రాజకీయ వేడి రగిలించారు. కోహెడ మార్కెట్, గాజులరామారంలో అంతర్జాతీయ బస్ టెర్మినల్, మునిసిపల్ కార్పోరేషన్ కార్యాలయాలకు శ్రీకారం వంటి పనులతో దూకుడుపెంచారు. నగరంపై పట్టు సాధించకుండా తెలంగాణపై పూర్తి కమాండ్ రాదని భావిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రాబోయే మున్సిపల్ ఎన్నికల కోసం నగర ఓటర్లను ఆకట్టుకునేలా ఈ "అభివృద్ధి మంత్రం" పఠిస్తున్నారు. గత రెండేళ్ళలో జరిగిన కంటోన్మెంట్, జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని ఒంటిచేత్తో గెలిపించిన రేవంత్ ఇపుడు జీహెచ్ఎంసికి వ్యూహరచన ప్రారంభించారు. 'హైదరాబాద్ బ్రాండ్' మరియు 'కేంద్ర వివక్ష' అనే రెండు బలమైన సెంటిమెంట్ అస్త్రాలతో గ్రేటర్ వార్‌కు క్షేత్రస్థాయిని సిద్ధం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో కేంద్రరాష్ట్రాల మధ్య ఈ పొలిటికల్ వార్ మరింత ముదిరే అవకాశం ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్ లో రెండేళ్ళ విజయోత్సవ సభలు జరుగుతున్నాయి. కూటమి ఐక్యత కొనసాగుతుండగా, కేంద్రప్రభుత్వం నుండి ఏపీ భారీగానే లబ్దిపొందుతోంది. ఇటీవల అమరావతిలో సెక్రటేరియట్ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం పలికింది. తెలంగాణకు సంబంధించి గతంలో కేంద్రంలోని ప్రధాని, హోంమంత్రులు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల సమయంలో స్వయంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదిలాబాద్ సీసీఐని తెరిపిస్తామని హామీనిచ్చి కూడా గెలిచాక ఇపుడు తుక్కు కింద అమ్మేస్తున్నారు. ఏపీకి ఫండింగ్ తెలంగాణకు పెండింగ్ అన్నచందంగా కేంద్రం తీరు కనిపిస్తోంది

> **తెలంగాణ రాజకీయ రంగస్థలంపై ముసురుతున్న వ్యూహాల మేఘాలు.. గ్రేటర్ పీఠాన్ని దక్కించుకునేందుకు సాగుతున్న తెరవెనుక సమర సంకేతాలు! ఒకవైపు ఢిల్లీ వేదికగా సాగుతున్న లీగల్ చదరంగం, మరోవైపు నిధుల కొరతతో నత్తనడకన సాగుతున్న హైదరాబాద్ నగర ప్రగతి చక్రాలు.**

> **తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్న రాజకీయం.. 'అభివృద్ధి వర్సెస్ అథారిటీ'. మీనాక్షి నటరాజన్ ఎపిసోడ్‌తో కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి లీగల్ షాక్ ఇచ్చింది. లేని కేసును అడ్డంపెట్టి నామినేషన్ తిరస్కరించడంతో పాటు ఆ నెపం కూడా కాంగ్రెస్ పై నెట్టి మైండ్ గేమ్ ఆడింది. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి కనీసం ఒక రోజు స్క్రూటినీని వాయిదా వేసి ఉంటే, ఆమె ఉన్నత న్యాయస్థానం నుండి స్టే లేదా అనుకూల ఉత్తర్వులు తెచ్చుకునే అవకాశం ఉండేది. ఆ సమయం ఇవ్వకుండా రాత్రికి రాత్రే ఏకపక్షంగా నామినేషన్ తిరస్కరించడం ఢిల్లీ బిజెపి ముందస్తు వ్యూహంగానే కనిపిస్తున్నది.**

> **హైదరాబాద్ మెట్రో రెండో విడత విస్తరణ ఫైళ్లు ఢిల్లీ, హైదరాబాద్ మధ్య నలుగుతుండటం నగర ప్రజలకు పెద్ద శాపంగా మారింది. దీని వెనుక ప్రధానంగా రెండు అడ్డంకులు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం సుమారు 122.9 కిలోమీటర్ల మేర 8 కొత్త కారిడార్లతో కూడిన సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూ.38,595 కోట్ల అంచనాతో కేంద్రానికి సమర్పించింది. ఫిఫ్టీఫిఫ్టీ ఉమ్మడి భాగస్వామ్యం కింద నిర్మించాలన్నది రాష్ట్ర ప్రతిపాదన. అయితే, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వద్ద ఈ ఫైలు ఇంకా టెక్నికల్ స్క్రూటినీ మరియు క్యాబినెట్ ఆమోదం దశలోనే ఆగిపోయింది.**

> **మెట్రో ఉత్తర భాగం సంగారెడ్డి - తూప్రాన్ - గజ్వేల్ - చౌటుప్పల్ సెగ్మెంట్‌కు సంబంధించి దాదాపు 94శాతం భూసేకరణ పూర్తయింది. దక్షిణభాగంకు సంబంధించి చౌటుప్పల్ - ఆమన్ గల్ - శంకర్ పల్లి - సంగారెడ్డి సెగ్మెంట్ ఇంకా అలైన్‌మెంట్ , ప్రాథమిక భూసేకరణ దశలోనే ఉంది. దీనికి కేంద్ర రవాణా శాఖ తుది అనుమతులు, రూ.15,627 కోట్ల సవరించిన అంచనాలకు ఆమోదం ఇంకా రాలేదు. కాబట్టి ఈ టర్మ్‌లో దక్షిణ భాగం పూర్తి కావడం అసాధ్యం.**

> **మెట్రో ఫేజ్-2 విషయానికొస్తే ఇంకా కేంద్రం అనుమతులే ఇవ్వలేదు. కేంద్రం ఈ ఏడాది చివర్లో అనుమతులు ఇచ్చినా.. టెండర్లు ముగిసి, పిల్లర్లు లేచి, రైలు పట్టాలెక్కడానికి కనీసం ఐదారేళ్ళు పడుతుంది. అంటే 2031 లేదా 2032 నాటికి కానీ ఫేజ్-2 పూర్తి రూపం దాల్చదు.**

> **గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల పరిధిలో లోక్‌సభ ఎన్నికల్లో నగర ప్రజలు బీజేపీకి పెద్దపీట వేశారు. సికింద్రాబాద్ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర ప్రగతిపై బీజేపీ ఎంపీల బాధ్యతపై చర్చ సహజంగా జరుగుతోంది. తెలంగాణకు రావాల్సిన మెట్రో ఫేజ్-2 నిధులు, ట్రిపుల్ ఆర్ నిధులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొక్కిపెడుతోందని, గుజరాత్‌లోని సూరత్, రాజ్‌కోట్ మెట్రోలకు ఇస్తున్న ప్రాధాన్యత హైదరాబాద్‌కు ఇవ్వడం లేదని కాంగ్రెస్ సౌత్ సెంటిమెంట్, కేంద్ర వివక్ష అస్త్రాన్ని ప్రయోగిస్తోంది.**


> **గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల పరిధిలో లోక్‌సభ ఎన్నికల్లో నగర ప్రజలు బీజేపీకి పెద్దపీట వేశారు. సికింద్రాబాద్ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర ప్రగతిపై బీజేపీ ఎంపీల బాధ్యతపై చర్చ సహజంగా జరుగుతోంది. తెలంగాణకు రావాల్సిన మెట్రో ఫేజ్-2 నిధులు, ట్రిపుల్ ఆర్ నిధులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొక్కిపెడుతోందని, గుజరాత్‌లోని సూరత్, రాజ్‌కోట్ మెట్రోలకు ఇస్తున్న ప్రాధాన్యత హైదరాబాద్‌కు ఇవ్వడం లేదని కాంగ్రెస్ సౌత్ సెంటిమెంట్, కేంద్ర వివక్ష అస్త్రాన్ని ప్రయోగిస్తోంది.**


> **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత కొన్ని వారాలుగా హైదరాబాద్ ను చుట్టేస్తున్నారు. ఇబ్రహీంపట్నం కోహెడ, ఉప్పల్, గాజులరామారం, ఫ్యూచర్ సిటీ ఇలా వరుస సభలతో గ్రేటర్ హైదరాబాద్ లో రాజకీయ వేడి రగిలించారు. కోహెడ మార్కెట్, గాజులరామారంలో అంతర్జాతీయ బస్ టెర్మినల్, మునిసిపల్ కార్పోరేషన్ కార్యాలయాలకు శ్రీకారం వంటి పనులతో దూకుడుపెంచారు. 'హైదరాబాద్ బ్రాండ్' మరియు 'కేంద్ర వివక్ష' అనే రెండు బలమైన సెంటిమెంట్ అస్త్రాలతో గ్రేటర్ వార్‌కు క్షేత్రస్థాయిని సిద్ధం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర-రాష్ట్రాల మధ్య ఈ పొలిటికల్ వార్ మరింత ముదిరే అవకాశం ఉంది.**

> **తెలంగాణకు సంబంధించి గతంలో కేంద్రంలోని ప్రధాని, హోంమంత్రులు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల సమయంలో స్వయంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదిలాబాద్ సీసీఐని తెరిపిస్తామని హామీనిచ్చి కూడా గెలిచాక ఇపుడు తుక్కు కింద అమ్మేస్తున్నారు. ఏపీకి ఫండింగ్ తెలంగాణకు పెండింగ్ అన్నచందంగా కేంద్రం తీరు కనిపిస్తోంది.**

# పొత్తు రాజకీయం




తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులుండవని, ఒంటరిగానే బరిలో ఉంటామని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుత పరిస్థితులలో బీఆర్ఎస్ ఒక విచిత్రమైన పరిస్థితి ఎదుర్కొంటోంది. నాయకత్వ లేమితో పాటు క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం తన్, మన్ ధన్ తో పని చేసే నాయకులు కూడా కొరవడ్డారు. అక్కడక్కడా కొంత మంది నేతలున్నా పార్టీ శ్రేణులను ఒకటి చేసి పార్టీని ఉరకలు పెట్టించేందుకు నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులున్నాయి. ఇలాంటి పరిస్థితులలో బీఆర్ఎస్ ఒక విలక్షణమైన, అత్యంత సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం గులాబీ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. ఇంత వరకు ఎన్నికల్లో ఓటమిపై నాయకత్వం లోతైన విశ్లేషమ కూడా జరపలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పార్టీ పయనంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. మరో పక్క కేసీఆర్ తనయ కవిత పార్టీ నాయకత్వంపై తిరుగుబాటు చేసి స్వంత పార్టీని ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికీ బీఆర్ఎస్ నేతలే టార్గెట్ గా ఆరోపణలను గుప్పిస్తున్నారు. కవిత తీరుపై ఇప్పటి వరకు పార్టీ అగ్రనేత కేసీఆర్ తో పాటు పార్టీని ముందుండి నడిపిస్తున్న కేటీఆర్ కానీ, హరీష్ రావు కానీ స్పందించలేని, ఖండించలేని పరిస్థితులలో ఉన్నారు. మాట్లాడితే హరీష్ రావు, కేటీఆర్ లనే కవిత టార్గెట్ చేస్తున్నారు. ప్రతీ అంశంలో కాంగ్రెస్ పార్టీ కంటే సీఎం రేవంత్ రెడ్డి కంటే తన కుటుంబసభ్యులనే కవిత లక్ష్యంగా చేసుకుని పని చేస్తున్నారు. ఈ సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్గత సమావేశాల్లో వచ్చే ఎన్నికల్లో మనది ఒంటరి పోరే.. ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు అని గట్టిగా చెప్తున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం ఆ మాటలపై ఇంకా నమ్మకం కలగడం లేదు. దీనికి ప్రధాన కారణం.. కేంద్రంలోని బీజేపీపై, మోదీ ప్రభుత్వంపై కేటీఆర్ గానీ, కేసీఆర్ గానీ ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించకపోవడమేనన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

ఇకపోతే 2024 పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను నిశితంగా గమనిస్తే, బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు క్రమంగా బీజేపీ వైపు మళ్లినట్లు స్పష్టమైంది. గతంలో గులాబీ వైపు నిలిచిన అర్బన్, సెమి అర్బన్, హిందూ ఓటర్లు గంపగుత్తగా కమలం వైపు మొగ్గు చూపినట్లు స్పష్టమవుతోంది. ఈ పరిణామంతో తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని తామే భర్తీ చేశామని, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ గట్టిగా చాటుకుంటోంది.

అంతే కాకుండా 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరిగిన రెండు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ వ్యూహం పూర్తిగా బెడిసికొట్టింది. సర్పంచ్ ఎన్నికలు, మునిసిపల్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అనుకున్నంత స్థాయిలో సత్తా చాటలేకపోయింది. కొంతలో కొంత బీజేపీ మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను నిలువరించింది. ఒక కార్పొరేషన్ ను స్వాధీనం చేసుకోవడంతో పాటు మునిసిపాలిటీలలో బలమైన ఉనికిని చాటుకున్నది. అయితే బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లను బీజేపీ సాధించకపోయినప్పటికీ కాంగ్రెస్ దూకుడుకు అడ్డుకట్ట వేసింది. ఇలాంటి తరుణంలో తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి అసలు క్షేత్రస్థాయి బలం లేదని కేటీఆర్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ ఓట్లను లాగేసుకున్న బీజేపీని ధాటుగా ఎదుర్కోకుండా, కేవలం కాంగ్రెస్‌నే టార్గెట్ చేయడం పొలిటికల్ సర్కిల్స్‌లో పలు అనుమానాలకు తావిస్తోంది. బీజేపీపై సాఫ్ట్ పాలిటిక్స్ నడుపుతూ రేపటి ఎన్నికల్లో ఆ పార్టీనే మాకు ప్రధాన ప్రత్యర్థి అని చెప్తే ప్రజలు కన్విన్స్ అవ్వడం కష్టమేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ ప్రజల చెవిలో గూడుకట్టుకుని ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారం తప్పని చెప్పేందుకే కేటీఆర్ ఒంటరి పోరని అంటున్నారా అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి. నాయకత్వ లేమి, క్షేత్రస్థాయిలో పని చేసే కేడర్ నిర్వీర్యమైన ప్రస్తుత పరిస్థితులలో ఒంటరి పోరు అనేది ఎంత వరకు సరైందన్న చర్చ కూడా మొదలైంది. ఇక టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ గా రూపాంతరం చెందిన కేసీఆర్ పార్టీ గురించి పరిశీలిస్తే మొదటి నుంచి కాంగ్రెస్ అనుకూల వైఖరితోనే వెళ్ళింది కానీ ఎక్కడా బీజేపీకి సానుకూలంగా పని చేసిన దాఖలాలు లేవు, పలు సందర్భాల్లో బీజేపీతో కలిసి వెళ్ధామని భావించినప్పటికీ కాషాయాధిపతులు ఎప్పటికప్పుడు ఆ పార్టీని దూరం పెడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే కేంద్రంలో బీజేపీ బలమైన పార్టీగా, రాష్ట్రంలో కాంగ్రెస్ శక్తివంతమైన పార్టీలుగా ఉన్నాయి. ఈ రెండు పార్టీలను సమర్థవంతంగా ఢీకొట్టే శక్తి బీఆర్ఎస్ కు ఉందా? ఒక వేళ బీఆర్ఎస్ ఒంటరిగా ఎన్నికల బరిలో దిగితే రెండు పార్టీలను ఢీకొట్టే సత్తా ఉందా అన్నది చర్చనీయాంశంగా మారింది.

ఓ వైపు కుటుంబసభ్యుల ఆరోపణలు, మరో వైపు పదేళ్ళ అధికారంలో పాలనాపరమైన నిర్ణయాలలో తప్పులు చేశారంటూ నమోదైన కేసుల విచారణలు, ఇంకోవైపు నిరాశ, నిస్పృహలతో ఉన్న కేడర్ లో ఉత్సాహం నింపడం ఇవన్నీ సాధ్యమయ్యే పనులేనా అన్న అంశంపై కూడా చర్చ జోరందుకుంది.

కాంగ్రెస్, బీజేపీల కంటే కవిత పార్టీ టీఆర్ఎస్ తోనే బీఆర్ఎస్ కు అత్యంత ప్రమాదకరం. కవిత అధికారంలోకి వస్తారా రారా అన్నది పక్కు పెడితే భారీగా బీఆర్ఎస్ ఓట్లను చీల్చడం ఖాయమన్న విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. వీటన్నింటి పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక పెద్ద యాసిడ్ టెస్ట్. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలంటే.. అటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను అంతే తీవ్రంగా నిలదీయాలి. అలా కాకుండా కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే పూర్తి ఫోకస్ పెట్టి, కేంద్రంపై చిన్న విమర్శ కూడా చేయకపోతే, ప్రజలు బీఆర్ఎస్‌ను కేవలం ఒక 'బిటీమ్' గానే చూసే ప్రమాదం ఉంది. ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీలతో తలపడేటప్పుడు రెండు వైపులా సమానమైన దూకుడు ప్రదర్శించినప్పుడే పొలిటికల్ సీరియస్‌నెస్ కనిపిస్తుంది. కేటీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదనే విమర్శలు పోవాలంటే బీజేపీ కాంగ్రెస్ లను సమకోణంలో చూడాల్సి ఉంది. ఇదే సమయంలో పక్కలో బల్లెంలా మారిన కవిత పార్టీని కూడా కని పెట్టాల్సిన అవసరం ఉంది. లేదంటే, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బీఆర్ఎస్ ఎంత మొత్తుకున్నా, విశ్లేషకులు గానీ, అటు ఓటర్లు గానీ దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి, సాఫ్ట్ పాలిటిక్స్ పక్కనబెట్టి తీవ్రమైన దూకుడు ప్రదర్శించడమే ఇప్పుడు కేటీఆర్ ముందున్న ఏకైక మార్గం.



-గడ్డం కృష్ణమూర్తి
అసోసియేట్ ఎడిటర్, మహా పత్రిక



# సమితి సింగారంలో.. సంత పనులకు శ్రీకారం..

- గ్రామాభివృద్ధే లక్ష్యంగా.. ప్రజలకు మెరుగైన సౌకర్యాలే ధ్యేయం
- సర్పంచ్, ప్రజాప్రతినిధులు..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గం, మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీలో గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా మరో అడుగు పడింది. గ్రామంలోని డిపో రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న సంత (అంగడి) అభివృద్ధి పనులకు గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు మాదాడి రాజేష్, కోలపిన్ని మానస పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంత (అంగడి)ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా కృషి కొనసాగుతోందని చెప్పారు. సంతను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని, పనులు పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు నాణ్యమైన, తాజా సరుకులు ఒకేచోట అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కోలపిన్ని మానస, మాదాడి రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఎం చారీ, ఎండి యాకూబ్ అలీ, బొజ్జా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



# సామ్య తండాలో ఘనంగా బోనాల సంబరాలు

- అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు...
- భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న గ్రామస్తులు...

**కారేపల్లి , మహా:**సింగరేణి మండల పరిధిలోని సామ్య తండా గ్రామంలో శ్రీ నాబీశీల బొడ్రాయి ముత్యాలమ్మ తల్లి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ చైర్మన్ ధరావత్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు.ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ వస్త్ర ధారణలో మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, భక్తి గీతాల నడుమ మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ కుటుంబాల శ్రేయస్సు కోసం మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామ పెద్దలు, భక్తులు ముత్యాలమ్మ తల్లి మరియు పోతురాజులకు మేకపోతులను బలిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అమ్మవారి కటాక్షంతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.పంటల సాగు ప్రారంభమయ్యే ఈ కీలక సమయంలో నిర్వహించే బోనాల పండుగ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామంపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ హిరాలాల్, ఉపసర్పంచ్ గుగులోత్ భీక్కులాల్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు గూగులోత్ భీముడు నాయక్ , బానోతు రాందాస్,రామచందర్ ,లావుడియా ఈర్యా నాయక్ ,రాజేష్ ,నాగేష్ ,యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ బోనాల సంబరాలు సామ్య తండా గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి.



# ఉప్పుసాక – జిన్నిగట్టు రహదారి దుస్థితిపై రాస్తారోకో

**వెంటనే బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఎం డిమాండ్**

**బూర్గంపాడు, మహా :** బూర్గంపాడు మండలంలోని పినపాక పట్టినగర్ గ్రామం నుంచి ఉప్పుసాక, జిన్నిగట్టు, ఒడ్డుగూడెం గ్రామాలకు వెళ్లే రహదారి అత్యంత దయనీయ స్థితిలో ఉండటంతో గ్రామస్తులు, సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందని ఆరోపిస్తూ గ్రామస్తులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా ఈ రహదారి పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి గ్రామసభలో రహదారికి మంజూరు లభించిందని చెబుతున్నప్పటికీ, ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఉప్పుసాక గ్రామంలో ఆశ్రమ పాఠశాల, గిరిజన హాస్టల్ ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నారని తెలిపారు. రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని, రాత్రి సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని చెప్పారు. ఇటీవల పలువురు గ్రామస్తులు గుంతల్లో పడి గాయపడిన ఘటనలను ప్రస్తావిస్తూ, ఇటీవల రెంటాల శ్రీను అనే వ్యక్తి రహదారిలోని గుంతలో పడిపోవడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకముందే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ ప్రాంతంలో అనేకసార్లు పర్యటించినప్పటికీ రహదారి సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. అలాగే ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అధికారులు ఆశ్రమ పాఠశాల, గిరిజన హాస్టల్‌లను సందర్శించినప్పటికీ రహదారి దుస్థితిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పినపాక పట్టినగర్ నుంచి జిన్నిగట్టు వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిని వెంటనే బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసి, ఉప్పుసాక, జిన్నిగట్టు, ఒడ్డుగూడెం తదితర ఎస్టీ గ్రామాల ప్రజలకు సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. రహదారి నిర్మాణంలో మరింత ఆలస్యం చేస్తే ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కురుస తిరుపతయ్య, బొల్లి శ్రీను, రవికుమార్, ఎడమ వెంకటేశ్వర్లు, సోడే లక్ష్మి, కురుస ఎర్రమ్మతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బూత్ స్థాయిలో కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం..

**బీఎల్ఏలే పార్టీ విజయానికి కీలకం**
**: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**మణుగూరు, మహా :**రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం అత్యంత కీలకమని, అందులో బూత్ లెవల్ ఏజెంట్లు ప్రధాన పాత్ర పోషించాలని పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని అంబేద్కర్ సెంటర్ డీవీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఎల్ఏల శిక్షణా శిబిరంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షబ్బీర్ అలీ, తోట దేవి ప్రసన్న హాజరై బూత్ స్థాయి నాయకులకు ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా సవరణ, పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ఢిల్లీలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న పోరాటం క్షేత్రస్థాయిలో విజయం సాధించినప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రతి బీఎల్ఏ పార్టీ సైనికుడిలా పనిచేస్తూ దొంగ ఓట్లు, డబ్బు ప్రలోభాలు, ప్రతిపక్షాల కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొంటూ, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా అనర్హుల పేర్లు తొలగించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

**బి ఎల్ ఏ లు అప్రమత్తంగా ఉండాలి- డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న..**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న సూచించారు. 18 ఏళ్లు నిండిన యువత పేర్లు నమోదు చేయించడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, చిరునామా మార్పులు వంటి అంశాలను ఫారం6, 7, 8 ద్వారా వెంటనే పూర్తి చేయించాలని తెలిపారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, బూత్ లెవల్ ఏజెంట్లు కేవలం ఓటరు జాబితా పనులకే పరిమితం కాకుండా ప్రజలకు, పార్టీకి మధ్య వారధిలా వ్యవహరించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ పథకాల లబ్ధిదారులను వ్యక్తిగతంగా కలిసి ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీకి అనుకూల వాతావరణం కల్పిస్తూ, కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. పార్టీ బలం నాయకులతో కాదని, క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలతోనే పెరుగుతుందని పేర్కొంటూ రాబోయే ఎన్నికల్లో పినపాక నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వచ్చేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, బీఎల్ఏలు, నియోజకవర్గ మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏజెన్సీ ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి..

- అభివృద్ధి పనులకు శంకుస్థాపన..
- మరో కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ సాయం..
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, మహా :** ఏజెన్సీ ప్రాంత షెడ్యూల్డ్ కులాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటానని, నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శనివారం మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన మూడు వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు.

**- ఏజెన్సీ ప్రాంత ఎస్సీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా..**

మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు కేటాయించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను జనరల్ కేటగిరీలో కలపడం వల్ల ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ధరణి అమలులోకి వచ్చిన తర్వాత మాన్యువల్ పహానీల ఆధారంగా సాగుభూములకు పంట రుణాలు పొందుతున్న అనేక మంది ఎస్సీ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**- సీఎంఆర్ఎఫ్ ద్వారా మరో కుటుంబానికి ఆర్థిక సాయం..**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాయం ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అల్లపల్లి మండలం కర్నెగూడెం గ్రామానికి చెందిన కోరం నాగేశ్వరరావుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్య చికిత్సలకు దూరం కాకుండా ప్రభుత్వం నిరంతరం సహాయం అందిస్తోందన్నారు. నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఒక వరంగా మారిందని పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించడమే తన బాధ్యత అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ ఇనుముల వెంకటేశ్వర్లు, సలిగంటి కొమరయ్య, వల్లపాక నాగేశ్వరరావు, ఏఈ, డీఈ అధికారులు, మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, మైనారిటీ అధ్యక్షుడు రహీం పాషా, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు సామా శ్రీనివాసరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, తుపూడి శ్రీను, అబ్దుల్లా, నాగేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురం రవి, దేవదాస్, మేస్త్రి రవి, సుబ్రమణ్యం, మంగ, దేవి, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

**రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులకు శ్రీకారం..**

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్, మేదర్ బస్తి, కుంకుడు చెట్ల గుంపు ప్రాంతాల్లో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రహదారి, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ పనులు పూర్తయిన అనంతరం ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో నీటి నిల్వలు, బురద సమస్యలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.


# ఎండల నుంచి ఉపశమనం కోసం మజ్జిగ పంపిణీ..

**మణుగూరు, మహా :** మండుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కల్పించే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గురిజాల గోపి ఆదేశాల మేరకు ఆయన కుమారులు గురిజాల సందీప్, గురిజాల సాయి ఆధ్వర్యంలో శనివారం మణుగూరు పట్టణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సీతారామ థియేటర్ సమీపంలో లక్ష్మి పేపర్ ప్లేట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బాటసారులు, ప్రయాణికులు, కార్మికులకు ఉచితంగా చల్లని మజ్జిగ అందజేశారు. ఎండల తీవ్రత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ సేవా కార్యక్రమం ఎంతో ఉపశమనం కలిగించింది. సుమారు 500 మందికి పైగా ప్రజలు ఈ సేవను వినియోగించుకుని వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని గురిజాల గోపి సూచించినట్లు పేర్కొన్నారు.

# సారపాక బూత్215కు బీఎల్ఏగా జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వారాల వేణు నియామకం



**బూర్గంపహాడ్, మహా :**కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి బూత్ స్థాయి వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా పినపాక నియోజకవర్గంలో బూత్ లెవల్ ఏజెంట్ల (BLA) శిక్షణా శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. మణుగూరు మండలంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న డీవీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బీఎల్ఏలకు పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ షబ్బీర్ అలీ, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ముఖ్య అతిథులుగా హాజరై బూత్ స్థాయి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వారాల వేణును సారపాక బూత్ నంబర్215కు బూత్ లెవల్ ఏజెంట్ (BLA)గా నియమించారు. పార్టీ అభివృద్ధి, ఓటరు జాబితాల పర్యవేక్షణ, కొత్త ఓటర్ల నమోదు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాల సమన్వయం వంటి కీలక బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిత్యం ప్రజలతో మమేకమై పనిచేసే బూత్ స్థాయి నాయకులే పార్టీ విజయానికి పునాదులని పేర్కొన్నారు. ప్రతి బీఎల్ఏ తమ పరిధిలోని ప్రతి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలు అందరికీ చేరేలా కృషి చేయాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారాల వేణు మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కట్టుబడి ఉంటానన్నారు. సారపాక బూత్215 పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ముఖ్యంగా యువత, మహిళలు, కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలుస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తానన్నారు. పార్టీ బలోపేతంలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బాసర ఐఐఐటీ సీటు సాధించిన గిరిపుత్రిక

**దమ్మపేట,మహా**:పట్టుదల, కృషి ఉంటే లక్ష్యాలను చేరుకోవచ్చని నిరూపిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దుర్గం గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని దాది హాసిని బాసర ఐఐఐటీలో ప్రవేశానికి ఎంపికైంది. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన హాసిని ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 503 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది.ఆమె విద్యా ప్రతిభ, కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) బాసర ఐఐఐటీలో ప్రవేశం పొందడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. హాసిని సాధించిన ఘనత ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు.

# గిరిజన నిరుద్యోగ యువతకు శుభవార్త.. ఉచిత నైపుణ్య శిక్షణ

**భద్రాచలం, మహా:** గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్) శిక్షణ కేంద్రాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. 18 నుంచి 33 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్టీ యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కంప్యూటర్ కోర్సుకు ఒక బ్యాచ్, బ్యూటీషియన్ కోర్సుకు రెండు బ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వ్యక్తిత్వ వికాసం, వృత్తి నైపుణ్యాలు, జీవన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పూర్తిగా ఉచితంగా నిర్వహించే ఈ శిక్షణలో పాల్గొనే వారికి భోజనం, వసతి సదుపాయాలు కూడా కల్పించనున్నారు. ఆసక్తి గల గిరిజన యువతీ యువకులు తమ సమీపంలోని సేవా కేంద్రాల ద్వారా లేదా నేరుగా వైటీసీ శిక్షణ కేంద్రాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు జూన్ 20 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 08743222334 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల భారాన్ని తగ్గించాలి

**మందమర్రి, మహా :** ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల భారాన్ని తగ్గించాలని బీఎస్పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోతపై ఆయన సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను అభ్యసించే విద్యార్థులకు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతుండటంతో తల్లిదండ్రులపై మోయలేని భారం అవుతుందని వివరించారు. ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ఫీజుల భారాన్ని తగ్గించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన కోరారు. నెలవారి ఫీజులను తగ్గించకుంటే జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని చెప్పారు.




# యువత క్రీడల్లో రాణించాలి

- క్రికెట్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకల్లో కుడా చైర్మన్,డిసిసి అధ్యక్షులు ఇనగాల

**హన్మకొండ మహా;** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంగపల్లిలోని డబ్ల్యూడీసీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి డబ్ల్యూడీసీఏ, హెచ్‌సీఏ సంయుక్తంగా ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారుల ప్రోత్సాహానికి పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. యువ క్రికెటర్లు క్రమశిక్షణతో ఆడుతూ, ఫిట్‌నెస్‌పై దృష్టి సారించి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించేలా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఇనగాల యువ క్రీడాకారులకు సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ కిట్ల ను పంపిణీ చేశారు. ఈ ముగింపు వేడుకల్లో డబ్ల్యూడీసీఏ నిర్వాహకులు, హెచ్‌సీఏ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు జూపల్లి కృష్ణారావు

- రిమ్మ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం
- లైబ్రరీకి రూ.10 లక్షల మంజూరు

**ఆదిలాబాద్ మహా:** ఆదివాసీల ఆచార సంప్రదాయాలు దేశానికి ఆదర్శమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో పర్యటించిన ఆయన నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారులు నైతం కవితసోము, తొడసం సుదర్శన్‌మధుబాయి, సీతాబాయిదేవురావు కుటుంబాలకు చెందిన నూతన గృహాలను మంత్రి పరిశీలించి, ప్రభుత్వ సహాయంతో సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని అన్నారు.రిమ్మ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటి వరకు 69 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హులైన కుటుంబాలకు అదనపు గృహాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామానికి అవసరమైన బీటీ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామంలో గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం చిట్టచివరి లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందుర్ జంగుబాయి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ఓట్ చోరీతో పాటు సీట్ చోరీకి పాల్పడుతోంది: జూపల్లి

- ఎస్ఐఆర్ తో ఓట్లు తొలగించే కుట్ర
- వెస్ట్ బెంగాల్ ,బీహార్ లో అలానే గెలిచింది
- బీఆర్ ఎస్ హయాంలో రాష్ట్రం అప్పుల కుప్ప
- ఆదిలాబాద్ కలెక్టరేట్ మీడియా సమావేశంలో
- విపక్షాలపై మంత్రి జూపల్లి విమర్శలు

**దిలాబాద్ మహా :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ చోరీతో పాటు సీట్ చోరీకి పాల్పడుతోందని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు ఆరోపించారు.శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎస్ ఐఆర్ తో తనకు అనుకులంగా ఓట్లు ఉంచి ప్రతిపక్షాలకు అనుకులంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రక్రియను చేపట్టిందని, ఈ ప్రక్రియ ద్వారానే ఇటీవల వెస్ట్ బెంగాల్, బీహార్ లో గెలిచిందని అన్నారు. అటు మధ్యప్రదేశ్ కు సంబంధించి మీనాక్షినటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించి సీట్ చోరీకి కూడా పాల్పడుతోందన్నారు. పనికి రాని కేసు పేరుతో ఆమె నామినేషన్ ను తిరస్కరించారన్నారు. ఇది పూర్తిగా బీజేపీ కుట్ర అని ఆరోపించారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని వచ్చే కాలంలో గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు.ఇక తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండున్నర ఏండ్లలో ఎన్నికల సమయంలో మెనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేశామన్నారు. తాము అధికారంలోకి రాకముందు పదేండ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. ఆర్థిక భారం ఉన్న కూడా ప్రజా సంక్షేమమంతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 12 ఏండ్ల కాలంలో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ మీడియా సమావేశంలో , ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష ,గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్ , అడ్డి భోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి 2,216 కోట్లు మంజూరు చేసింది

- బాసర నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక కారిడార్ ఏర్పాటు
- 70 కోట్ల నిధులతో గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మానం
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కు ప్రశంసల జల్లులు



**మంచిర్యాల, మహా :** కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి 2,216 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క ప్రకటించారు. శనివారం మంచిర్యాల జిల్లా గండపల్లి మండలం గూడెం రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ఆయనతో పాటు రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, భూపాలపల్లి, రామగుండం నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ, మక్కన్ సింగ్ ఠాకూర్, మంచిర్యాల, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ధర్ని మధుకర్, మహంకాళి స్వామి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి 2 వేల 216 కోట్ల రూపాయలతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈమధ్య కాలేశ్వరంలో సరస్వతి పుష్కరాలను కూడా నిర్వహించినట్లు చెప్పారు. రాబోవు గోదావరి పుష్కరాలలో పుష్కర ఘాట్ల నిర్మాణం, అవసరమైన వసతుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. బాసర నుండి భద్రాచలం వరకు 802 కోట్ల రూపాయలతో ఆధ్యాత్మిక కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు 70 కోట్ల రూపాయల నిధులతో గూడెం దేవాలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవటం జరిగిందని వివరించారు. గత నెల పిప్రి వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి చే గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 37 రోజుల వ్యవధిలోనే పనులు చేపట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా గూడెం గుట్ట పరిధిలో 74 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు కూడా మంత్రి భూమి పూజ నిర్వహించారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్యం, వ్యవసాయ, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిలో నియోజకవర్గ శాసనసభ్యులు కృషి అభినందనీయమని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ను ప్రశంసల జల్లుల తో ముంచెత్తారు.రాష్ట్ర ఐ. టి. శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దేవాదాయ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. రాబోవు గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క పంట ఎండిపోలేదని, ప్రకృతితో కలిసి జీవిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలతో పాటు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అనంతరం పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 9 కోట్ల 70 లక్షల రూపాయల మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ సంఘ భవనాల నిర్మాణం, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో 2 కోట్ల 30 లక్షల రూపాయల నగరాభివృద్ధి నిధులతో సి.సి. రోడ్డు పనులు, 2 కోట్ల రూపాయలతో మురుగునీటి కాలువ నిర్మాణ పనులు, దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలో 58 కోట్ల రూపాయల అంచనా నిధులతో ఆలయ పున: నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలలోని మోదెల, ద్వారక, గుడి రేవు గ్రామాల సమీపంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమవైపున 74 కోట్ల 40 లక్షల రూపాయల అంచనా నిధులతో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ..

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని రాళ్లగూడ కు చెందిన చీర్ల బాబమ్మకు రెండు లక్షల 50 ల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చేకును గాయత్రి మిల్క్ సెంటర్ బంధువులు రవి కి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం అందజేశారు. వైద్య నిమిత్తం ఖర్చు చేసుకొని ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. హాస్పిటల్లో చికిత్స నిమిత్తము అందించిన పేదవారికి పెద్దన్న లాగా అండగా సీఎం సహాయ నిధి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, దూడల వెంకటేష్ గౌడ్, సొసైటీ చైర్మన్ దవణాకర్ గౌడ్,నిరటి రాజు, చంద్రారెడ్డి, జీటే సిద్దులు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మానందం అక్రమ అరెస్టును ప్రజలు ఖండించాలి

**మందమర్రి, మహా :** ఐఎఫ్టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కామ్రేడ్ బ్రహ్మానందం అక్రమ అరెస్టును ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని ఆ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షులు ఎండి జాఫర్, జి ఎల్ బి కే ఎస్ రాష్ట్ర నాయకులు పీ కిష్టన్న, ఎస్ తిరుపతి రెడ్డి, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ముష్కే జ్యోతి లు కోరారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పలు అభివృద్ధి పనుల మంచిర్యాల జిల్లాకు వస్తున్న విషయం తెలిసిందే. అయితే బ్రహ్మానందం గత కొన్ని సంవత్సరాలుగా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యల పై పోరాటాలు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ప్రతినిధిగా ఉప ముఖ్యమంత్రి కి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లిన బ్రహ్మానందం అరెస్టు చేయడం తగదని వారు హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఆయా కార్మికుల సమస్యలు తీర్చకపోవడం విడ్డూరంగా ఉందని వారు మండిపడ్డారు. అరెస్టు చేసిన కామ్రేడ్ బ్రహ్మానందం తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.






# ఓట్ చాలా కీలకం

- ఓట్లు తొలగించే బీజేపీ కుట్రను అడ్డుకుందాం
- మన ఓటు కాపాడుకోవడం మన బాధ్యత
- బీఎల్ఏ-2లది ముఖ్య పాత్ర
- కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో బీఎల్ఏ-2లకు శిక్షణ అవగాహన సదస్సు
- హాజరైన టీపీసీసీ కోర్డినేటర్లు

**ఆదిలాబాద్ మహా :** ఎస్ఐఆర్ తో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుతో విపక్ష పార్టీల ఓట్లు ప్రమాదంలో పడ్డాయని భారీగా ఓట్ల చోరీ జరుగుతోందని టీపీసీసీ కోఆర్డినేటర్ నరేష్ రాథోడ్ అన్నారు. శనివారం ఆయన తన సహచర కోర్డినేటర్లు రాఘవేంద్ర రెడ్డి,మోహన్ కుమార్ లతో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు ఆఫీస్ లో నిర్వహించిన బీఎల్ఏ2 శిక్షణా సదస్సు కు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఎస్ ఐఆర్ తో బీజేపీ ఈసీఐను అడ్డుపెట్టుకుని ఒక పథకం ప్రకారం వాటి వ్యతిరేక ఓట్లు తొలగిస్తుందన్నారు. ఈసీఐ నియామక ప్రక్రియలో 2023 లో కేంద్రం చేసిన కొత్త చట్టం ప్రకారం త్రిసభ్య కమిటీలో ప్రధాన మంత్రి, లోకసభ ప్రతిపక్షనేతతో పాటు మూడో వ్యక్తిగా ఉన్న సీజేఐ ను తొలగించి ప్రధాని నామినేట్ చేయబడిన కేంద్రమంత్రిని ఆస్థానంలో భర్తీ చేయడంతో ఈసీఐ పారదర్శకత పై ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయన్నారు. అందుకే మన జాగ్రత్తలో మనముండాలని మన ఓటును కోల్పోకుండా మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. పార్టీ పటిష్ఠతలో పార్టీ ఓట్లు గల్లంతు కాకుండా కాపాడటంలో బీఎల్ఏ 2 ల పాత్ర చాలా కీలకమన్నారు. అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి , సభా అధ్యక్షురాలు కంది మౌనా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కేంద్రం కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తోందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ లో 91 లక్షల ఓట్లు , తమిళనాడు లో 74 లక్షల ఓట్లు తొలగించిందన్నారు.ఆయా రాష్ట్రాలలో ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ , స్టాలిన్ ఓడిపోవడానికి ఈ ఓట్లు తొలగింపే కారణమన్నారు. మనమంతా కలిసి కట్టుగా ఈ ఓట్ల చోరీని అడ్డుకోవాలన్నారు. ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీ ని గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిగా రేవంత్ రెడ్డి మరో మారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసేందుకు అందరం కలిసి పని చేద్దామన్నారు. బీఎల్ లు జాగ్రత్త వహించి ఓట్ డబల్ లిస్ట్ కాకుండా ఉన్న ఓటు పోకుండా జచూడాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనుకూల ఓట్లు తొలగించేలా బీజేపీ కుట్రను సమర్ధ వంతంగా అడ్డుకోవాలన్నారు. 2002 ను ప్రామాణికంగా చేసుకుని నిర్వహిస్తున్న ఎస్ ఐఆర్ లో ఓటును మ్యాపింగ్ చేసుకుని కాపాడుకోవాలన్నారు.ముఖ్యంగా మైనార్టీలు, మహిళల ఓట్ల తొలగింపు పై బీజేపీ కన్నేసిందని జాగ్రత్త వహించాలన్నారు. మన ఓటు చోరీ కాకుండా కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. ఆదిలాబాద్ నియోజవర్గంలో ఇంకా 91వేల ఓట్లు మ్యాపింగ్ కాలేదన్నారు.. అందులో 42వేల ఓట్లు ప్రశ్నార్ధకంగా ఉన్నాయన్నారు. మండల జిల్లా కార్యవర్గ పదవుల్లో ఉన్నవారు సరిగా పని చేయకపోతే తొలగించే చర్యలు తీసుకుంటామన్నారు. ఇది చా లా ముఖ్యమైన విషయమని ఒక్క ఓటు కూడా పోకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇందుకు బీఎల్ఏ 2లు చాలా ముఖ్యపాత్ర వహించాలన్నారు. ప్రతీ పది బూత్ లకు ఒక సూపర్ వైజర్ నియామకం చేపడతామని ఎస్ఐఆర్ పై అవగాహన ఉండి ఔత్సాహికులైన నాయకులు కార్యకర్తలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ..పార్టీ బలంగా ఉండాలంటే మనమందరం కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓట్ చాలా కీలకమని అది పోకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతీ ఒక్కరు మ్యాపింగ్ చేయించుకోవాలని సూచించారు. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింటిని ప్రజలకు తెలియ చెప్పేలా కృషి చేయాలన్నారు. మరోమారు అధికారంలోకి రావాలంటే శ్రేణులంతా కష్టపడిపని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ , మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖిజర్ పాషా, డీసీసీ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, దీపక్ రావు,నాయకులు కొండ గంగాధర్ ,పరమేశ్వర్, బొల్లారం బాబన్న,పట్టణ కౌన్సిలర్లు , డీసీసీ కార్యదర్శులు ,మండల అధ్యక్షకార్యదర్శులు , బీఎల్ఏలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా దోసపాటి..

- తిరుపతిలో ప్రమాణ స్వీకారం...,
- నియామక పత్రం అందజేసిన ప్రముఖులు అమరావతి లక్ష్మీనారాయణ, టీజీ వెంకటేష్..

**మణుగూరు, మహా :** తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా ఎస్కేటీ గ్రూప్ సంస్థ చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ పదవికి సంబంధించిన నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ, ప్రముఖులు టీజీ వెంకటేష్ లు అందజేశారు. కార్యక్రమం తిరుపతిలో ఘనంగా నిర్వహించబడగా, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై దోసపాటి వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన భక్తులు, వ్యాపారవేత్తలు, యాత్రికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ భవన నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఈ సందర్భంగా దోసపాటి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజలకు తిరుపతిలో ప్రత్యేక వసతులు కల్పించే దిశగా ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుందని, భవన నిర్మాణ పనులను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని దోసపాటి వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేష్ మాట్లాడుతూ దోసపాటి వెంకటేశ్వరరావు నాయకత్వంలో తెలంగాణ భవన నిర్మాణ కార్యక్రమం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, భక్తులు, సామాజిక ప్రముఖులు, అభిమానులు పాల్గొని దోసపాటి వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.


# ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

**ఎంఈఓ భాస్కర్**

**వలిగొండ జూన్ 13 మహా న్యూస్**
విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ సుంకోజు భాస్కర్ అన్నారు శనివారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అన్ని వసతులతో ఉన్నాయని అన్నారు ప్రైవేట్ పాఠశాలకు పంపించి డబ్బులు వృధా చేసుకోవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు

# వీధి నాటకానికి విశేష స్పందన

**ఇబ్రాహీం పట్నం జూన్ 13 మహా:** మంచాలలో వేసిన వీధి నాటకానికి ప్రజల వద్ద నుంచి విశేష స్పందన వచ్చిందని భజన మండలి అన్నారు. రంగారెడ్డి జిల్లా, మంచాల మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ నల్ల చక్రవర్తి వీదినాటకం గత మూడు రోజులుగా ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో కళలు కనుమరుగవుతున్న తరుణంలో ఈలాంటి వీదినాటకం వేయడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నాటకం తిలకించడానికి గ్రామంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భజన భక్తులు, గ్రామ సర్పంచ్, ఉప్ప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొని జయప్రదం చేశారు..



# మల్టీప్లెక్స్‌ల టార్గెట్.. జెన్ జీ ఆడియన్స్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మల్టీప్లెక్స్ థియేటర్ల ముఖచిత్రం వేగంగా మారుతోంది. కేవలం భారీ బడ్జెట్, అగ్ర హీరోల పెద్ద సినిమాలపైనే ఆధారపడకుండా నిరంతరం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేందుకు మల్టీప్లెక్స్ యాజమాన్యాలు సరికొత్త వ్యూహాలను తయారు చేస్తున్నాయి. ఇందులో భాగంగా 'జెన్ జీ' వినియోగదారులను తమ ప్రధాన ఆడియన్స్ గ్రూప్‌గా మల్టీప్లెక్స్ పరిశ్రమ టార్గెట్ చేస్తోంది. ఓటీటీలు, రీల్స్ వంటి ఆన్‌లైన్ వేదికలపై విరక్తి (డిజిటల్ అలసట) చెందిన యువత.. మళ్లీ థియేటర్ల వైపు అడుగులు వేస్తుండటం ఇండస్ట్రీలో సరికొత్త ఆశలను రేకెత్తిస్తోంది. మరోవైపు, పెద్ద సినిమాల విడుదలకు మధ్య ఉండే గ్యాప్‌లో మల్టీప్లెక్స్‌ల్లో ఆక్యుపెన్సీ రేటు పడిపోకుండా ప్రాంతీయ చిత్రాలు, హాలీవుడ్ సినిమాలు, ఊహించని రీతిలో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లే చిన్న చిత్రాలు (స్లీపర్ హిట్లు) కీలక పాత్ర పోషిస్తున్నాయి.



### బాక్సాఫీస్‌ను శాసిస్తున్న యూత్!

ఇటీవల విడుదలైన ప్రముఖ మీడియా కన్సల్టింగ్ సంస్థ ఓర్మాక్స్ మీడియా టోబర్ 2026 నివేదిక ప్రకారం.. భారతీయ బాక్సాఫీస్ వసూళ్లలో యువత పాత్ర ఏ స్థాయిలో ఉందో స్పష్టమైంది. హిందీ బాక్సాఫీస్ మొత్తం కలెక్షన్లలో 30 ఏళ్ల లోపు ఉన్న యువత వాటా ఏకంగా 57% గా ఉంది. ఇక ఒక సినిమా విడుదలైన మొదటి రోజు (ఫస్ట్ డే) వచ్చే రెవెన్యూలో ఈ యువ తరం వాటా అత్యధికంగా 70% గా నమోదు కావడం విశేషం.'ప్రస్తుతం సినిమా థియేటర్లకు వస్తున్న వారిలో జెన్ జీ తరం వారే అత్యధికంగా ఉంటున్నారు. ఆన్‌లైన్ వేదికలతో విసిగిపోయిన యువత, మళ్లీ వెండితెర అనుభూతిని ఆస్వాదించేందుకు థియేటర్లకు తిరిగి వస్తున్నారు' అని పీవీఆర్ ఐనాక్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ బిజ్లీ అన్నారు.

### ఒరిజినల్ కథలకే జై కొడుతున్న యువత

ఏదో ఒక సూపర్ హీరో ఫ్రాంచైజీలనో, పాత హిట్ చిత్రాల రీమేక్‌లనో లేదా రీబూట్‌లనో కాకుండా.. సరికొత్త లైన్లతో, ఒరిజినల్ కథాంశాలతో వచ్చే సినిమాలను చూసేందుకే యువత మక్కువ చూపుతున్నారని సంజీవ్ బిజ్లీ పేర్కొన్నారు. యువ దర్శకులు రూపొందించిన సరికొత్త చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఎలా కనెక్ట్ చేస్తున్నాయనే దానికి కర్రీ బార్కర్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ హారర్ చిత్రం 'అబ్సెషన్', కేన్ పార్సన్స్ దర్శకత్వంలో వచ్చిన 'బ్యాక్‌రూమ్స్' చిత్రాల విజయాలే నిదర్శనమని ఉదహరించారు.

### భవిష్యత్తు ట్రెండ్స్ ఇవే..

సినిమా ఎగ్జిబిషన్ రంగాన్ని రాబోయే రోజుల్లో కొన్ని అంశాలు శాసించనున్నాయని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. అవి.. థియేటర్లలో అధునాతన స్క్రీన్లు, మెరుగైన సీటింగ్, లగ్జరీ అనుభూతిని అందించడం. ద్వితీయ, తృతీయ శ్రేణి (టైర్2, టైర్3) పట్టణాలు, నగరాలకు మల్టీప్లెక్స్‌లను విస్తరించడం. కేవలం ఈవెంట్ సినిమాలు, పెద్ద చిత్రాలపైనే ఆధారపడకుండా.. విభిన్నమైన కంటెంట్‌తో వచ్చే స్లీపర్ హిట్ చిత్రాల ద్వారా థియేటర్లను నిరంతరం నిర్వహించడం.

## 2.5 లక్షల్లో స్క్రాంబ్లర్ బైక్ కొనాలా?
# ఈ రెండింటిలో ఏది బెస్ట్?

**భారత మార్కెట్‌లో అడ్వెంచర్, స్క్రాంబ్లర్ బైక్‌లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. ముఖ్యంగా నగర రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని గుంతలు, కంకర రోడ్లు, తేలికపాటి ఆఫ్‌రోడింగ్ పరిస్థితుల్లోనూ స్మూత్ రైడింగ్ సామర్థ్యంతో ఉండటంతో యూత్ స్క్రాంబ్లర్ బైక్‌లవైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ స్క్రామ్ 440ని అందుబాటులోకి తీసుకురాగా.. ఇటీవల యెజ్డీ నుంచి సరికొత్త స్క్రాంబ్లర్ బైక్‌లు వచ్చాయి. ప్రస్తుతం రూ.2.5 లక్షల్లోపు ధరలో ఈ రెండు బైక్‌లు అందుబాటులో ఉన్నాయి. మరి వీటిలో ఏది బెస్ట్ అనేది ఒకసారి పరిశీలిద్దాం..**

### ఇంజిన్-పనితీరు

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో 443సీసీ సామర్థ్యం గల సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ గరిష్ఠంగా 25.4బీహెచ్‌పీ పవర్, 34ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 6 స్పీడ్ గేర్‌బాక్స్ అమర్చారు. ముఖ్యంగా తక్కువ ఆర్‌పీఎం వద్ద ఎక్కువ టార్క్ అందించడం వల్ల కొండ ప్రాంతాలు, కఠినమైన రోడ్లపై ప్రయాణానికి ఇది అనుకూలంగా ఉంటుంది. అదే యెజ్డీ స్క్రాంబ్లర్ 334 సీసీ సింగిల్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది 29.59బీహెచ్‌పీ పవర్, 30 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పవర్‌పరంగా యెజ్డీ స్క్రాంబ్లర్ ముందంజలో ఉండగా, టార్క్ విషయంలో స్క్రామ్ 440 ముందు ఉంది. వేగవంతమైన యాక్సిలరేషన్, హైవే రైడింగ్‌ను ఇష్టపడేవారికి యెజ్డీ బైక్ బాగా నచ్చే అవకాశం ఉంది.



### డిజైన్

స్క్రామ్ 440లోసీటు ఎత్తు 795 మిల్లీమీటర్ల ఎత్తులోనే ఉండటంతో పొట్టిగా ఉన్నవారు కూడా సులభంగా నడపగలరు. 200 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్ ఉండటం వల్ల గుంతలు, స్పీడ్ బ్రేకర్లపై ఇబ్బంది ఉండదు. దీని వీల్‌బేస్ 1460 మిల్లీమీటర్లు కాగా.. మొత్తం బరువు 196 కిలోలు.యెజ్డీ స్క్రాంబ్లర్‌లో సీటు ఎత్తు 813 మిల్లీమీటర్ల ఎత్తులో ఉంది. పొడవుగా ఉండే వారికి ఈ బైక్ అనుకూలంగా ఉంటుంది. బరువు విషయానికి వస్తే ఇది స్క్రామ్ 440 కంటే తక్కువ. దీని బరువు కేవలం 174 కిలోలు మాత్రమే. స్క్రామ్‌తో పోలిస్తే 22 కిలోల వరకు తక్కువ బరువు ఉండటంతో ట్రాఫిక్‌లో, టర్నింగ్స్‌లో మరింత చురుకైన హ్యాండ్లింగ్ ఉంటుంది.

### బ్రేకింగ్-సస్పెన్షన్

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో ముందు 300మిల్లీమీటర్ల డిస్క్, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. ముందు 41 మిల్లీమీటర్ల టెలిస్కోపిక్ ఫోర్క్‌లు, వెనుక లింకేజ్‌తో కూడిన మోనోషాక్ సస్పెన్షన్ అందించారు. ముందు 190మిల్లీమీటర్లు, వెనుక 180 మిల్లీమీటర్ల సస్పెన్షన్ ట్రావెల్ ఉండటంతో కఠినమైన రోడ్లపై కూడా మంచి సౌకర్యవంతమైన రైడింగ్‌ను అందిస్తుంది.యెజ్డీ స్క్రాంబ్లర్‌లో ముందు 320 మిల్లీమీటర్లు, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ భద్రత కూడా ఉంది. ముందు టెలిస్కోపిక్ హైడ్రాలిక్ ఫోర్క్, వెనుక ట్విన్ షార్క్ అబ్జార్బర్ల వ్యవస్థను ఉపయోగించారు.

### ఇంజిన్ ట్యాంక్- ప్రయాణ సామర్థ్యం

స్క్రామ్ 440లో 15లీటర్ల పెద్ద ఫ్యూయల్ ట్యాంక్ ఉంది. లాంగ్ జర్నీలు చేసేవారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. యెజ్డీ స్క్రాంబ్లర్‌లో 12.5 లీటర్ల ట్యాంక్ మాత్రమే ఉంది. అయితే తక్కువ బరువు కారణంగా ఇంధన వినియోగం కొంత మెరుగ్గా ఉండే అవకాశం ఉంది.

### ధర

రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 ప్రారంభ ఎక్స్‌షోరూం ధర రూ.2.23 లక్షలుగా ఉంది. అదే యెజ్డీ స్క్రాంబ్లర్ ప్రారంభ ధర రూ.1.99 లక్షలుగా ఉంది. అంటే యెజ్డీ బైక్ సుమారు రూ.24వేల తక్కువ ధరలో లభిస్తుంది. వీటన్నింటి ఆధారంగదా బలమైన నిర్మాణం, అధిక టార్క్, టూరింగ్ సామర్థ్యం ముఖ్యమైతే రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 సరైన ఎంపిక అని ఆటోమొబైల్ నిపుణులు సూచిస్తున్నారు. అదే తక్కువ బరువు, ఎక్కువ పవర్, చురుకైన హ్యాండ్లింగ్, తక్కువ ధరలో స్క్రాంబ్లర్ కావాలనుకుంటే యెజ్డీ బెటర్ అని చెబుతున్నారు.

# ఎన్ని ఈఎంఐలు చెల్లించకపోతే బ్యాంకు మీ ఇంటిని వేలం వేస్తుంది?

నేటి కాలంలో చాలా మంది గృహ రుణం తీసుకున్నారు. వారి జీవితమంతా ఈఎంఐ చెల్లించడానికే గడిచిపోతోంది. ఈఎంఐ చెల్లించే ప్రతి ఒక్కరి పరిస్థితి ఎలా ఉందంటే, జీవితంలో ఎలాంటి ముఖ్యమైన విషయాలను వదులుకున్నా సరే, ఈఎంఐ చెల్లించడం మాత్రం అస్సలు వదులుకోకూడదు. ఇలాంటి పరిస్థితుల్లో గృహ రుణం ఈఎంఐని సకాలంలో చెల్లించకపోతే ఇంటిని వేలం వేస్తారనే భయం ప్రతి ఒక్కరినీ వెంటాడుతోంది. గృహ రుణం ఈఎంఐ చెల్లించనంత మాత్రాన ఇంటిని వేలం వేసే చట్టపరమైన ప్రక్రియ వెంటనే ప్రారంభం కాదు. పరిస్థితి మరింత దిగజారక ముందే దాన్ని పరిష్కరించుకునేందుకు వీలుగా, బ్యాంకు ముందుగా ఒక హెచ్చరిక ఇచ్చి, దాన్ని సరిదిద్దుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. ఆర్‌బిఐ ఆదాయ గుర్తింపు, ఆస్తి వర్గీకరణ (IRAC) నిబంధనల ప్రకారం.. ఒక రుణగ్రహీత వరుసగా మూడు నెలల ఈఎంఐలు, అంటే సుమారు 90 రోజుల పాటు బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే ఆ రుణ ఖాతాను నిరర్థక ఆస్తి (NPA)గా ప్రకటిస్తారు. NPAగా నిర్ధారించిన తర్వాత SARFAESI చట్టం 2002లోని సెక్షన్ 13(2) కింద, బ్యాంకు రుణగ్రహీతకు 60 రోజుల లిఖితపూర్వక నోటీసును పంపుతుంది. ఈ నోటీసులో మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడానికి లేదా అవకాశం ఇస్తుంది బ్యాంకు. 60 రోజులు గడిచిన తర్వాత కూడా చెల్లింపు జరగకపోతే, బ్యాంకు ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. దానిని నిర్వహించవచ్చు లేదా వేలం ప్రక్రియను ప్రారంభించవచ్చు. వేలం ప్రక్రియను ప్రారంభించే ముందు SARFAESI నియమాలు 2002లోని నియమం 8 ప్రకారం.. ఆస్తి ధర, వేలం తేదీని పేర్కొంటూ బ్యాంకు 30 రోజుల 'అమ్మకం నోటీసు' జారీ చేయడం తప్పనిసరి. 60 రోజులు గడిచిన తర్వాత కూడా చెల్లింపు జరగకపోతే, బ్యాంకు ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. దానిని నిర్వహించవచ్చు లేదా వేలం ప్రక్రియను ప్రారంభించవచ్చు.





వేలం ప్రక్రియను ప్రారంభించే ముందు SARFAESI నియమాలు 2002లోని నియమం 8 ప్రకారం.. ఆస్తి ధర, వేలం తేదీని పేర్కొంటూ బ్యాంకు 30 రోజుల 'అమ్మకం నోటీసు' జారీ చేయడం తప్పనిసరి. మీడియా నివేదికల ప్రకారం.. నిరర్థక ఆస్తి (NPA)గా ప్రకటించిన తర్వాత వేలం ప్రారంభించడానికి బ్యాంకు కనీసం 105 రోజులు వేచి ఉండాలి. ఇందులో 60 రోజుల డిమాండ్ నోటీసు, రుణగ్రహీత స్పందించడానికి 15 రోజులు, అమ్మకపు నోటీసుకు 30 రోజులు ఉంటాయి. మొత్తం మీద మొదటి EMI చెల్లించకపోవడం నుండి వేలం వరకు ఈ మొత్తం ప్రక్రియకు సాధారణంగా 8 నుండి 12 నెలల సమయం పట్టవచ్చు. ఈ సమయంలో రుణగ్రహీత తన హక్కులను వినియోగించుకోవడం ద్వారా పరిస్థితిని సరిదిద్దుకోవచ్చు.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## సీఎం రంగస్వామితో విజయ్ దూత రహస్య భేటీ!



పుదుచ్చేరి: పుదుచ్చేరి రాజకీయాల్లో అర్ధరాత్రి వేళ జరిగిన ఒక రహస్య సమావేశం ఇప్పుడు సంచలనంగా మారింది. రాబోయే తట్టంచావడి అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో.. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామితో, తమిళనాడు మంత్రి ఎన్ ఆనంద్ (బుస్సీ ఆనంద్) గురువారం రాత్రి జరిపిన ముఖాముఖి భేటీ రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తర్వాత ఆ ప్రభుత్వంలో అత్యంత కీలకమైన వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆనంద్.. నేరుగా సీఎం నివాసానికి వెళ్లి సుదీర్ఘంగా చర్చలు జరపడం కొత్త పొలిటికల్ ఈక్వేషన్లకు దారితీస్తోంది.

### ఉపఎన్నికల వేళ వ్యూహాత్మక భేటీ

ముఖ్యమంత్రి రంగస్వామి గత ఎన్నికల్లో మంగళం, తట్టంచావడి రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. అయితే, ఆయన తట్టంచావడి స్థానానికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. శాసనసభలో తమ బలాన్ని 12 స్థానాలకు పెంచుకోవాలని భావిస్తున్న అధికార పక్షం ఏఐఎన్ఆర్‌సీ, ఈ స్థానాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉంది. ఇలాంటి కీలక సమయంలో పుదుచ్చేరి మూలాలు ఉన్న బుస్సీ ఆనంద్.. పెళ్లి వేడుక కోసం వచ్చి, అర్ధరాత్రి సీఎం రంగస్వామిని కలవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందనే చర్చ నడుస్తోంది.

### విజయ్ దళపతి దూతగా బుస్సీ ఆనంద్?


బుస్సీ ఆనంద్ కేవలం తమిళనాడు మంత్రి మాత్రమే కాదు.. గతంలో 2006లో పుదుచ్చేరి ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు. నటుడు, సీఎం విజయ్ అభిమాన సంఘాన్ని రాజకీయ పార్టీగా మార్చడంలో ఆనంద్ కీలక పాత్ర పోషించారు. రంగస్వామితో ఆయనకు పాత వ్యక్తిగత, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. గతంలో పుదుచ్చేరి వచ్చినప్పుడు ఆలయ దర్శనం చేసుకుని వెళ్లిపోయిన ఆనంద్, ఈసారి మాత్రం నేరుగా సీఎం రంగస్వామితో చర్చలు జరపడం వెనుక సీఎం విజయ్ రాయబారం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### మారుతున్న పొత్తుల సమీకరణలు

తమిళనాడులో టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్నప్పటికీ, పుదుచ్చేరిలో పొత్తులపై ఇంకా ఎలాంటి అధికారిక చర్చలు జరగలేదు. ఒకవేళ పుదుచ్చేరి ఉపఎన్నికలో టీవీకే, కాంగ్రెస్ చేతులు కలిపితే అధికార ఎన్డీఏ కూటమికి గట్టి పోటీ ఎదురవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, గత ఎన్నికల్లో టీవీకేతో కలిసి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నేయం మక్కల్ కజగం పార్టీ కూడా ఈ ఉపఎన్నికలో పోటీ చేసేందుకు బుస్సీ ఆనంద్‌ను సంప్రదించడం ఈ సీటు చుట్టూ ఉన్న ఉత్కంఠను మరింత పెంచింది.

## మహిళా ఉద్యోగిపై పాశవికం.. కొడవలితో దాడి

**ముంబై:** మహారాష్ట్రలో దారుణం జరిగింది. పాల్ఘర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిపై ఒక వ్యక్తి అత్యంత పాశవికంగా దాడి జరిపాడు. ఆమెపై ఎనిమిది సార్లు కొడవలితో దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలైన మహిళా ఉద్యోగిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిన్న( శుక్రవారం) సాయంత్రం పాల్ఘర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్నస్నేహల్ సావంత్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుంది. ఈ సందర్భంలో నిందితుడు హఠాత్తుగా వెనుక నుండి వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చి కొడవలితో ఒక్కసారిగా దాడి చేశాడు. ఆ మహిళ మెడ, వీపు, భుజాలు , నడుము భాగాలపై దాదాపు ఎనిమిది సార్లు కొడవలితో విచక్షణారహితంగా నరికాడు. దీనితో ఆమెకు తీవ్ర రక్తస్రావమై కుప్పకూలిపోయింది.అయితే ఆమె స్పృహ కోల్పోయిన తర్వాత సైతం ఏ మాత్రం కనికరం లేకుండా పలుమార్లు దాడి చేశాడు. ఈ ఘటన వివరాలు అక్కడ సమీపంలో ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. దాడి చేసిన అనంతరం, నిందితుడు తన బ్యాగ్‌ను, దాడికి ఉపయోగించిన కొడవలిని అక్కడే వదిలేసి పరారయ్యాడు.అయితే తీవ్ర రక్తస్రావంతో అక్కడే పడి ఉన్న మహిళను స్థానికులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. స్నేహల్‌ను మొదట పాల్ఘర్‌లోని ఒక రూరల్ హాస్పిటల్‌కు తరలించగా ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ వివరాలు తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ దాడికి గల అసలు కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదని, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు.ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడిని అమోల్ ములేగా గుర్తించారు. అతను ఒక కోర్టు ప్యూన్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అతను పరారీలో ఉండటంతో, పోలీసులు అతడిని పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు.



## చుక్కలు చూపిస్తున్న సువేందు.. అభిషేక్ ఇంటి వద్ద అర్ధరాత్రి హైడ్రామా!

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ ఇంటి వద్ద అర్ధరాత్రి హైడ్రామా చోటుచేసుకుంది. సోదాల పేరుతో పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు.. అభిషేక్ ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించినట్లు టీఎంసీ వర్గాలు ఆరోపించాయి. ఈ విషయం తెలుసుకున్న మమతా బెనర్జీ.. హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళీఘాట్‌లోని అభిషేక్ బెనర్జీ నివాసంలో శనివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో దర్యాప్తు నిమిత్తం ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించాయి. ఈ సందర్భంగా సల్బోని ప్రాంతంలోని ఓ భూమికి సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ కోసం తాము గాలిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. అభిషేక్ నివాసంలో నాలుగు గంటలకు పైగా సోదాలు నిర్వహించారు. అయితే, పోలీసులతో పాటు కేంద్ర భద్రతా బలగాలు కూడా తనిఖీల్లో పాల్గొనడంతో టీఎంసీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ.. అభిషేక్ ఇంటికి చేరుకున్నారు. ఆమె రాకతో అక్కడ రాజకీయ ఉద్రిక్తత మరింత పెరిగింది. టీఎంసీ నేతలు ఈ సోదాలను రాజకీయ కక్షసాధింపు చర్యగా అభివర్ణించారు. సోదాల అనంతరం మీడియాతో మాట్లాడిన అభిషేక్ బెనర్జీ.. పోలీసులు అతిగా వ్యవహరించారని ఆరోపించారు. తన నివాసంలోకి గేటు తాళాలు బద్దలు కొట్టి ప్రవేశించారని అన్నారు. తాను ఏమైనా దాచిపెట్టానా? అంటూ ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తగిన న్యాయపరమైన చర్యలు పరిశీలిస్తామని చెప్పుకొచ్చారు. మరోవైపు.. బెంగాల్‌లో మున్సిపాలిటీ నియామకాల కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు టీఎంసీ ఎమ్మెల్యే మదన్మిత్ర నివాసంపై దాడులు చేశారు.



## భారత వాయుసేన విమాన ప్రమాదం.. ఐదుగురు మృతి



**ఢిల్లీ:** దేశంలో మరో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. అస్సాంలో శనివారం ఉదయం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఎఎన్32 ట్రాన్స్‌పోర్ట్ విమానం కూలిపోయింది. ల్యాండింగ్ చేస్తుండగా ఈ విమాన ప్రమాదం చోటు చేసుకుంది. విమానం క్రాష్ అయిన తర్వాత మంటలు చెలరేగాయి. జోర్హాట్ ఎయిర్ బేస్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు అధికారులు, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. ఈ ప్రమాదంలో మరొకరు గాయపడటంతో అతడికి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ప్రమాదంపై భారత వాయుసేన అధికారికంగా స్పందిస్తూ.. దర్యాప్తునకు ఆదేశించామని, పూర్తి వివరాలు సేకరించిన తర్వాత మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది.

## నిధి ఎక్కడ.. నవ్వులు పూయిస్తున్న ట్రైలర్



బాలీవుడ్ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీలో 'ధమాల్' ఒకటి. ఈ ఫ్రాంచైజీ నుంచి రానున్న తాజా సినిమా 'ధమాల్ 4'. అజయ్ దేవగన్ హీరోగా నటించిన ఈ అడ్వెంచరస్ కామెడీ ఎంటర్‌టైనర్‌కి ఇంద్రకుమార్ దర్శకుడు. అజయ్ దేవగన్, భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, అశోక్ థాకేరియా, ఇంద్రకుమార్, ఆనంద్ పండిట్, కుమార్ మంగత్ పాఠక్ నిర్మించిన ఈ మూవీ జూలై 10న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'హెల్ప్ చేయండి'..., 'సైతాన్ సింగ్ నిధికి చెందిన చిరునామాను కాస్త గట్టిగా చెప్పండి', 'అరె.., నిధికి సంబంధించిన మ్యాప్ దొరికింది' అని తెలుగు అర్థం వచ్చే హిందీ డైలాగ్స్ 'ధమాల్ 4' ట్రైలర్‌లో ఉన్నాయి. 'ధమాల్ 4'లో నాలుగింతల వినోదం ఉంటుందని ఇటీవల అజయ్ దేవగన్ పేర్కొన్నారు. ఇందుకు తగ్గట్లుగానే ట్రైలర్‌లో కామెడీ సీన్స్ కనిపిస్తున్నాయి.

### డ్రైవర్‌గా మారిన సీఎం విజయ్..
## 130 కిలోమీటర్లు స్వయంగా డ్రైవింగ్!


తమిళనాడు ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి, పార్టీ పెట్టిన రెండేళ్లకే అధికారంలోకి వచ్చాడు స్టార్ హీరో విజయ్. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తనదైనశైలీలో పరిపాలన సాగిస్తున్నాడు. హీరోగా ఉన్నప్పుడే ఆయన చాలా సింపుల్ లైఫ్‌ని లీడ్ చేసేవాడు. స్టార్ అనే గర్వం ఎక్కడ చూపించేవాడు కాదు. ఇక సీఎం అయిన తర్వాత ఆయనలో మరింత మార్పు వచ్చింది. ఎక్కడ కూడా అధికార గర్వం కనిపించడం లేదు. ప్రజలకు మరింత చేరువయ్యేలా ఆయన ప్రణాళికలు ఉంటున్నాయి. తాజాగా ఆయన కర్ణాటక కొల్లూరులోని శ్రీ మూకాంబికా అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అయితే ఈ పర్యటన సందర్భంగా విజయ్ చేసిన ఫీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత విజయ్ ఒక్కసారిగా డ్రైవర్ అవతారం ఎత్తాడు. ఆలయం నుంచి మంగళూరు విమానాశ్రయం వరకు దాదాపు 130 కిలోమీటర్లు కాన్వాయ్‌లో తాను ప్రయాణించే కారును స్వయంగా డ్రైవ్ చేశారు.సీఎం విజయ్ కారు నడుపుతుండగా, భద్రతా సిబ్బందికి చెందిన కాన్వాయ్ వాహనాలు ఆయనను అనుసరించాయి. ఈ ప్రయాణంలో భాగంగా ఒక టోల్ గేట్ వద్ద కారు ఆగినప్పుడు, పక్కనే ఉన్న అభిమానులను గమనించిన విజయ్.. ఎంతో నమ్మకంతో, చిరునవ్వుతో వారికి చేయి ఊపుతూ అభివాదం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



### హిస్టరీ క్రియేట్ చేసిన
## మైఖేల్ బయోపిక్..
### రూ. 8,600 కోట్లకు పైగా వసూళ్లతో సరికొత్త రికార్డు!




పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ 'మైఖేల్' ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టిచింది. ఇప్పటివరకు మ్యూజిక్ బయోపిక్ చిత్రాలలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ఉన్న 'బోహేమియన్ రాప్సోడి' రికార్డును ఈ చిత్రం తాజాగా దాటేసింది. హాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం, 'మైఖేల్' సినిమా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 911.9 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,673 కోట్లు) భారీ వసూళ్లను రాబట్టింది. దీంతో గతంలో 910.9 మిలియన్ డాలర్ల లైఫ్‌టైమ్ కలెక్షన్లతో అగ్రస్థానంలో ఉన్న 'బోహేమియన్ రాప్సోడి'ని ఇది వెనక్కి నెట్టి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు 2022లో వచ్చిన ఎల్విస్ ప్రెస్లీ బయోపిక్ 'ఎల్విస్' రికార్డులను కూడా ఈ చిత్రం బద్దలు కొట్టింది. ఈ సినిమాకు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహించగా.. జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్‌లో నటించాడు. ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో రెంటల్ విధానంలో స్ట్రీమింగ్ అవుతుంది.



### 500లతో ముంబైకి వచ్చింది..
## తెలుగులోనే ఫస్ట్ సినిమా..

ప్రస్తుతం సినీరంగంలో ఆమె తోపు హీరోయిన్. కానీ తొలిసారిగా చిత్రసీమలోకి అడుగుపెట్టినప్పుడు అసలు సినిమా, ఇండస్ట్రీ గురించి ఆమెకు ఏమాత్రం సంబంధం లేదు. అతి తక్కువ సమయంలోనే చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సృష్టించుకున్న కొద్దిమంది నటీమణులలో ఆమె ఒకరు. కానీ ఆమె విజయగాథ బయటకు కనిపించినంత సులభమైనది కాదు. ఈ స్థాయికి చేరుకోవడానికి ఆమె జీవితంలో ఎంతో పోరాడిందని చాలా తక్కువ మందికి తెలుసు. ఇప్పుడు మనం మట్లాడుకుంటున్న హీరోయిన్ మరెవరో కాదు దిశా పటాని. 1992, జూన్ 13న ఉత్తర ప్రదేశ్‌లోని బరేలీలో జన్మించిన ఆమె కుటుంబం మూలాలు ఉత్తరాఖండ్‌లోని తానక్‌పూర్. ఆమె తండ్రి జగదీష్ సింగ్ పటాని ఒక సీనియర్ పోలీస్ అధికారి కాగా, ఆమె తల్లి ఆరోగ్య శాఖలో పనిచేశారు. దిశా చిన్నప్పటి నుంచే చదువులో చాలా చురుకైనది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఆమె నటి కావాలని ఎప్పుడూ కలగనలేదు..

దిశ మొదట్లో ఎయిర్ ఫోర్స్ పైలట్ లేదా శాస్త్రవేత్త కావాలనుకుంది. అందుకే, ఆమె తర్వాత ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ చదివింది. కానీ ఆమె కాలేజీ రోజుల్లో విధి ఒక మలుపు తీసుకుంది. ఒక స్నేహితురాలు ఆమెను మోడలింగ్ పోటీలో పాల్గొనమని సలహా ఇచ్చింది. దిశ ఆ పోటీలో పాల్గొనడమే కాకుండా గెలుపొందింది కూడా. గెలిచిన తర్వాత, దిశాకు మోడలింగ్‌లో కొత్త మార్గాలు తెరుచుకున్నాయి, ఆమెకు అనేక ప్రముఖ బ్రాండ్‌ల వాణిజ్య ప్రకటనలలో నటించే అవకాశాలు రావడం ప్రారంభమైంది. వాణిజ్య ప్రకటనలలో కెమెరాను ఎదుర్కోవడం ఆమెలో నటన పట్ల ఆసక్తిని రేకెత్తించింది. చివరికి, తన కలలను సాకారం చేసుకోవడానికి ఆమె ముంబైకి వెళ్లాలని నిర్ణయించుకుంది, కానీ ఆ ప్రయాణం అంత సులభమైనది కాదు.

తాను మొదట ముంబైకి వచ్చినప్పుడు తన జేబులో కేవలం 500 రూపాయలు మాత్రమే ఉన్నాయని దిశా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించింది. ముంబై లాంటి ఖరీదైన నగరంలో అంత తక్కువ డబ్బుతో బతకడం ఒక సవాలు. కానీ ఆమె తన కుటుంబం నుండి ఎలాంటి ఆర్థిక సహాయం తీసుకోకూడదని, తాను చేసే పనులన్నీ సొంతంగానే చేసుకోవాలని నిశ్చయించుకుంది. 2015లో వచ్చిన లోఫర్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ మూవీ ఆమెకు తొలి చిత్రం. కానీ థియేటర్లలో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఒక సంవత్సరం తర్వాత, 2016లో, బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'ఎంఎస్ ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ'లో నటించే అవకాశం ఆమెకు దక్కింది. ఈ చిత్రంలో, ధోని మొదటి ప్రియురాలు ప్రియాంక ఝూగా ఆమె పోషించిన చిన్న పాత్రతో ప్రేక్షకులపై చెరగని ముద్ర వేసింది. తర్వాత హిందీలో వరుస సినిమాలతో రాణించింది. ప్రస్తుతం అవకాశాలు తగ్గినప్పటికీ నెట్టింట గ్లామర్ ఫోటోషూట్లతో రాణిస్తుంది.

### తన పేరుతో సైబర్ మోసాలు.. నకిలీ నంబర్‌ను షేర్ చేస్తూ
## అభిమానులను హెచ్చరించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి!

'లక్కీ భాస్కర్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక మీనాక్షి చౌదరి తాజాగా ఒక పెద్ద సైబర్ మోసంపై స్పందించారు. తన పేరుతో కొందరు కేటుగాళ్లు ప్రజలను, అభిమానులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె గుర్తించారు. తనలా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా బయటపెడుతూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు నకిలీ వ్యక్తి వాడుతున్న ఫోన్ నంబర్‌ను స్క్రీన్ షాట్ తీసి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మీనాక్షి పోస్ట్ చేశారు. ఈ నంబర్ నుండి ఎవరికైనా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలని కోరారు. అది తన నంబర్ కాదని స్పష్టం చేసిన ఆమె, ఈ మోసాన్ని సకాలంలో గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చిన నెటిజన్లకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. అందులో ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న 'వృషకర్మ' చిత్రంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ దండు దర్శకత్వంలో మైథలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.



## సుమనోహర రూపం.. సుందర వదనం..
### స్టన్నింగ్ లుక్ లో కవ్విస్తున్న పాయల్ పాప

5 డిసెంబర్ 1992న దేశ రాజధాని ఢిల్లీలో విమల్ కుమార్ రాజ్ పుత్, నిర్మల్ రాజ్ పుత్ దంపతులకు జన్మించింది పాయల్ రాజ్ పుత్. చిన్నతనం నుంచే నటనపై ఆశక్తితో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన తర్వాత చిత్రసీమలో అడుగుపెట్టింది ఈ ముద్దుగుమ్మ.2010లో సప్నోన్ సే భరే నైనా అనే ఓ హిందీ సీరియల్‌లో సోనాక్షి అనే పాత్రతో టెలివిజన్‌లో తన కెరీర్‌ని ప్రారంభించింది.2018లో ఆర్‌ఎక్స్100 అనే చిత్రంలో యంగ్ హీరో కార్తికేయకి జోడిగా తెలుగు చిత్రం పరిశ్రమలో అడుగుపెట్టింది ఈ బ్యూటీ.తర్వాత వెంకటేష్ సరసన వెంకీ మామ సినిమాలో కథానాయకిగా నటించింది. 2023లో మంగళవారం చిత్రంతో ఆకట్టుకుంది ఈ బ్యూటీ. ప్రస్తుతం పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ పేరు 'వెంకటలచ్చిమి'. ఈ సినిమాపై ఇండస్ట్రీలో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.కేవలం 'వెంకటలచ్చిమి' మాత్రమే కాకుండా తన తదుపరి కొత్త సినిమాలకు సంబంధించిన వివరాలను కూడా త్వరలోనే వెల్లడిస్తానని చెప్పింది.



## రామ్ చరణ్‌కు సర్జరీ.. RC17 మరింత ఆలస్యం కానుందా, ఆందోళనలో మెగా ఫ్యాన్స్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ అంటే తెలుగు సినీ అభిమానులకు వెంటనే గుర్తుకు వచ్చేది బ్లాక్‌బస్టర్ చిత్రం రంగస్థలం. ఈ సినిమా కేవలం బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడమే కాకుండా, నటుడిగా రామ్ చరణ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. 'చిట్టిబాబు' పాత్రలో చరణ్ కనబరిచిన నటన ఇప్పటికీ ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మళ్లీ వీరిద్దరి కలయికలో తెరకెక్కనున్న RC17 ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఇప్పటికే ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులను సుకుమార్ వేగవంతం చేసినట్లు సమాచారం. కథ, పాత్రల రూపకల్పన, టెక్నికల్ టీమ్ ఎంపిక వంటి అంశాలపై దర్శకుడు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రామ్ చరణ్ ఇటీవల విడుదలైన 'పెద్ది' సినిమాతో కెరీర్‌లో మరో భారీ విజయాన్ని అందుకున్నారు.

దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఈ గ్రామీణ క్రీడా నేపథ్య చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన నాటి నుంచి బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ఈ సినిమా ఇప్పటికే రూ.345 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా చరణ్ నటన, పాత్రలో ఆయన చూపించిన వైవిధ్యం విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. అయితే 'పెద్ది' సినిమా కోసం రామ్ చరణ్ తీవ్రంగా శ్రమించినట్లు తెలుస్తోంది. భారీ యాక్షన్ ఎపిసోడ్లు, కఠినమైన స్పోర్ట్స్ సీక్వెన్స్‌ల చిత్రీకరణలో పాల్గొనడం వల్ల ఆయనకు కొన్ని స్వల్ప గాయాలు అయినట్లు ఫిలింనగర్‌లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం వాటి నుంచి పూర్తిగా కోలుకునేందుకు కొంతకాలం షూటింగ్‌లకు దూరంగా ఉండాలని చరణ్ భావిస్తున్నట్లు సమాచారం.

ఇదే సమయంలో మరో వార్త కూడా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. రామ్ చరణ్ ఒక చిన్న సర్జరీ చేయించుకోనున్నారని, అనంతరం వైద్యుల సూచనల మేరకు కొన్ని నెలల పాటు పూర్తి విశ్రాంతి తీసుకునే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఈ కారణంగానే ఆయన కొత్త ప్రాజెక్టులను వెంటనే ప్రారంభించే పరిస్థితి లేదని సినీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. దీంతో RC17 ప్రాజెక్ట్ షెడ్యూల్‌పై కూడా ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందుగా ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో సెట్స్‌పైకి వెళ్లాల్సిన ఈ చిత్రం, ఇప్పుడు మరింత ఆలస్యం కావచ్చని సమాచారం. తాజా అంచనాల ప్రకారం సినిమా ప్రారంభోత్సవం 2027 జనవరి లేదా ఆ తర్వాత జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.ఒకవేళ ఇదే నిజమైతే 2027లో కూడా రామ్ చరణ్ నుంచి కొత్త సినిమా విడుదల కావడం కష్టమయ్యే పరిస్థితి ఏర్పడొచ్చు. ఫలితంగా అభిమానులు తమ అభిమాన హీరోను వెండితెరపై మళ్లీ చూడాలంటే 2028 వరకు వేచి చూడాల్సి రావచ్చని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com